KR TV

మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...




Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 సంచిక :91 | శనివారం 01 మార్చి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-

# పరాకాష్టకు చేరిన ప్రజాపాలన..


## విషాదంలో మంత్రుల వినోదం : కేటీఆర్

**హైదరాబాద్,క్రాంతి న్యూస్**
రాష్ట్రంలో ప్రజాపాలన పరాకాష్టకు చేరిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. విషాదంలోనూ మంత్రులు వినోదం పొందుతున్నారని కేటీఆర్ నిప్పులు చెరిగారు. హెలికాప్టర్ యాత్రలు చేస్తూ.. చేపకూర విందులతో ఎంజాయ్ చేస్తున్నారంటూ కాంగ్రెస్ మంత్రులపై కేటీఆర్ విరుచుకుపడ్డారు. హాస్టల్ విద్యార్థులకు మాత్రం అన్నం పెట్టకుండా పస్తులు ఉంచుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు.



విద్యార్థులకు కనీసం తిండి పెట్టలేని దుస్థితిలో రేవంత్ ప్రజా ప్రభుత్వం ఉందన్నారు. "అన్నం వండలేదు గుడిలో తినండి" అని నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం బల్మూరు మండలం కొండనాగుల ఎస్టీ బాలుర హాస్టల్ సిబ్బంది విద్యార్థులకు ఆదేశాలు ఇవ్వడం దారుణమన్నారు.

# ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యల్లో పురోగతి!



శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం (ఎస్ఎల్‌బీసీ)లో చిక్కుకున్న వారి కోసం ముమ్మరంగా చేపట్టిన సహాయక చర్యల్లో కీలక పురోగతి కనిపించింది. టన్నెల్‌లో చిక్కుకున్న వారి ఆచూకీని గుర్తించేందుకు పలువిధాలా గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్ టెక్నాలజీ ద్వారా సొరంగం స్కానింగ్ చేస్తుండగా.. ఐదుచోట్ల మెత్తని భాగాలు ఉన్నట్లు స్కానింగ్‌లో గుర్తించారు. టీబీఎం ముందు భాగం, దెబ్బతిన్నభాగంలో ఐదు మెత్తని భాగాలను గుర్తించారు.

# బెదిరిస్తే బెదరడానికి ఎవరూ లేరు

## - సీఎం రేవంత్ రెడ్డి



2 లో

తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి బెదిరిస్తే బెదరడానికి ఇక్కడ ఎవరు లేరని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కిషన్ రెడ్డి సైందవ పాత్ర పోషిస్తున్నారని ఆయన వ్యంగ్యంగా అన్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇద్దరు చీకటి మిత్రులు అని అభివర్ణించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది.

ఈ సమావేశానంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అడుగుతోన్న ప్రాజెక్ట్‌లకు అనుమతులు ఇస్తేనే తెలంగాణకు రావాలని కిషన్ రెడ్డికి ఆయన సవాల్ విసిరారు. కేంద్రం ప్రత్యేకంగా తెలంగాణకు ఇచ్చింది ఏమీ లేదన్నారు. ఇన్ని సార్లు ముఖ్యమంత్రి వచ్చి అడుగుతోన్నా.. మీ రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు మాత్రం తమను ఎందుకు అడగడం లేదని మోదీ కేబినెట్‌లోని మంత్రులు అంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.



# శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలి

## - కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలని యువతకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపు నిచ్చారు. గ్లోబల్ లీడర్ షిప్‌లో యువతదే కీలక పాత్ర అని ఆయన స్పష్టం చేశారు. నేషనల్ సైన్స్ డే సందర్భంగా హైదరాబాద్‌లోని విజ్ఞాన్ వైభవ్-2025ను సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. అనంతరం కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. సైన్స్ అండ్ టెక్నాలజీలో వచ్చే మార్పుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు..

రక్షణ శాఖ చారిత్రాత్మక విజయాల్లో కేంద్రం విశేష పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. అయితే గత కొద్ది సంవత్సరాలుగా ఈ శాఖకు తాను మంత్రిగా ఉండడం తన అదృష్టంగా భావిస్తున్నాన్నారు.

# దేశ రక్షణ బాధ్యత యువత పైనే ఉంది

## - సీఎం రేవంత్ రెడ్డి

దేశాన్ని రక్షించడంలో హైదరాబాద్ అత్యంత క్రియాశీలక పాత్ర పోషిస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు గచ్చిబౌలి స్టేడియంలో శుక్రవారం నేషనల్ సైన్స్ డే ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఎగ్జిబిషన్‌ను కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. డీఆర్‌డీవో, డిఫెన్స్, ఏరోస్పేస్ ఉత్పత్తులకు చెందిన 200 స్టాల్స్ ప్రదర్శించారు. డిఫెన్స్, ఏరోస్పేస్ రంగంలో భారత సామర్థ్యాలను ప్రదర్శించేలా స్టాల్స్ ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు నేషనల్ సైన్స్ డే ఎగ్జిబిషన్ జరగనుంది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు.



# పింకు బుక్‌ను మెయింటెన్ చేస్తున్నాం..


## తస్మాత్ జాగ్రత్త..

బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులపై దాడులు చేసిన వారి చిట్టా పింకు బుక్‌లో రాస్తామని టైం వచ్చిన రోజున వారి సంగతి తేలస్తామని ప్రతిపక్షాలపై దాడులు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సూచించారు. శుక్రవారం కొల్లాపూర్ మండలం సింగోటం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డితో కలిసి ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు.

2 లో

## నేటిమాట

"ఒక్క అవకాశంతో మీరు జీవితాన్ని మార్చుకోవచ్చు. కానీ, ఆ అవకాశాన్ని తీసుకోవడానికి ధైర్యం కావాలి."




-రతన్ టాటా



# భాజపా పాలనలో అన్ని విధాలుగా అణచివేత

## : మంత్రి ఉత్తమ్

2 లో



# వరంగల్ మామునూర్ ఎయిర్ పోర్ట్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్..

2 లో



2 లో

# రైతులకు శుభవార్త.. వాళ్లందరి ఖాతాల్లోకి డబ్బులు..

## డిప్యూటీ సీఎం కీలక ఆదేశాలు

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రైతులకు రేవంత్ రెడ్డి సర్కార్ తీపికబురు వినిపించింది. 3 ఎకరాల వరకు సాగు భూమి ఉన్న అన్నదాతలకు రైతు భరోసా నిధుల విడుదల ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక ఆదేశాలు జారీ చేశారు.

# మాజీ మంత్రి హరీష్ రావుపై మరో కేసు నమోదు



2 లో

బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు పై మరో కేసు నమోదు అయింది. బాచుపల్లి పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. హరీష్ రావు, ఆయన అనుచరులు బెదిరిస్తున్నారని కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# నా మూడు ప్రశ్నలకు హరీశ్‌రావు సమాధానం చెప్పాలి

## మంత్రి జూపల్లి

ఎస్ఎల్‌బీసీ వద్ద ప్రమాదం వ్యవహారంలో రాజకీయ దురుద్దేశంతోనే మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు చేస్తున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన



2 లో

# ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యల్లో కీలక పురోగతి!

మొదటి పేజీ తరువాయి

దీంతో చిక్కుకుపోయిన వారు అక్కడే ఉన్నట్లుగా సహాయక సిబ్బంది భావిస్తున్నారు. మరోవైపు, ఆ మెత్తని భాగాలు మానవ దేహాలు కావచ్చు.. కాకపోవచ్చు అని అధికారులు పేర్కొంటున్నారు. మెత్తని భాగాలు ఉన్నచోట తవ్వకాలు జరపనున్నారు. తవ్విన తర్వాత మానవ దేహాలా కాదా అనేది స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అలాగే, ఈ ఘటనలో గల్లంతైనవారి పరిస్థితిపై కాసేపట్లో అధికారిక సమాచారం వచ్చే అవకాశం ఉంది.

**తప్పుడు వార్తల్ని నమ్మొద్దు: కలెక్టర్**



టన్నెల్‌లో మృతదేహాలు లభించాయనేది అవాస్తవమని నాగర్‌కర్నూలు కలెక్టర్ సంతోష్ స్పష్టంచేశారు. తప్పుడు వార్తలను ఎవరూ నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఏదైనా సమాచారం ఉంటే.. తామే వెల్లడిస్తామన్నారు.

# శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలి - కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

మొదటి పేజీ తరువాయి

మానవుని మేధ సంపత్తు చాలా గొప్పదని చెప్పారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రక్షణ శాఖలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో దేశం కొత్త ఒరవడిని సృష్టిస్తోందని పేర్కొన్నారు. దేశంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతోందన్నారు. అన్ని రంగాల్లో భారత్ అగ్రగామిగా మారుతోందని చెప్పారు

యూపీఐ లావాదేవీలలో భారత్ నేడు అగ్రగామిగా ఉందన్నారు. గతేడాది అంటే.. 2024లో భారత్‌లో మాత్రమే రూ. 171 బిలియన్ల లావాదేవీలు జరిగాయని వివరించారు. ఈ మొత్తం లావాదేవీల విలువ రూ. 2.45 లక్షల కోట్ల రూపాయిలని ఆయన సోదాహరణగా వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్‌లో మనం ముందంజ వేయాల్సి ఉందని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభిప్రాయపడ్డారు. హార్డ్‌వేర్ నుంచి సాఫ్ట్‌వేర్‌కు యుద్ధం పెరుగుతున్నదన్నారు.

ఈ దృక్కోణం నుంచి కూడా.. సైన్స్ అండ్ టెక్నాలజీలో ముందుకు సాగడం ముఖ్యమని తెలిపారు. ఈ సందర్భంగా రాజకీయాల్లో ప్రవేశించే ముందు సైన్స్ విద్యార్థిగానే కాకు.. సైన్స్ ప్రొఫెసర్‌గా పని చేసినట్లు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. అంతకు ముందు గచ్చిబౌలి స్టేడియంలో అబ్దుల్ కలాం, సీవీ రామన్ విగ్రహాలకు పూలమాలలు వేసిన కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్‌తోపాటు సీఎం రేవంత్ రెడ్డి నివాళులర్పించారు.

విజ్ఞాన్ వైభవ్-2025లో భాగంగా డీఆర్డీడీవో ఆధ్వర్యంలో యుద్ధాల్లో వినియోగించే మిస్సైల్స్‌ను గచ్చిబౌలి స్టేడియంలో నేటి నుంచి అంటే.. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ప్రదర్శించనున్నారు. వీటిని విద్యార్థులతో పాటు సామాన్యులు సైతం వీక్షించే అవకాశాన్ని అధికారులు కల్పించారు.

# బెదిరిస్తే బెదరడానికి ఎవరూ లేరు

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ పార్టీ నిర్మాణం ద్వారా బలమైన పునాదులు వేస్తామన్నారు. పేద వారికి కాంగ్రెస్ పార్టీ అందుబాటులో ఉండేలా చేస్తామని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించామని చెప్పారు. కార్యకర్త మనసు ఎరిగిన నాయకురాలు మీనాక్షీ నటరాజన్ అని ఆయన తెలిపారు.

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతున్న విధానం చూస్తే తనకు నవ్వొస్తుందన్నారు. తాము అడుగుతోంది ప్రధాని మోదీ ఆస్తి కాదన్నారు. తాము కట్టిన పన్నుల నుంచి తమకు నిధులు ఇవ్వమని మాత్రమే అడుగుతున్నామన్నారు. బిహార్, ఉత్తరప్రదేశ్‌కు ఇస్తున్న ప్రాధాన్యత తెలంగాణకి ఇవ్వరా? అని మోదీ ప్రభుత్వాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా సూటిగా ప్రశ్నించారు.

మూసీకి నిధుల ఇవ్వమంటే ఎందుకంత అసహనమంటూ బీజేపీ నేతల వైఖరిపై సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మెట్రో ప్రాజెక్ట్‌కు నిధులు ఇవ్వమంటే ఇవ్వడం లేదన్నారు. మెట్రో, రీజనల్ రింగ్ రోడ్డును కేంద్ర క్యాబినెట్ ఎజెండాలో ఎందుకు పెట్టడం లేదంటూ బీజేపీ అగ్రనేతలను ఈ సందర్భంగా ఆయన నిలదీశారు. కేంద్రం ప్రత్యేకంగా తెచ్చిన ప్రాజెక్టు ఒక్కటైనా తెలంగాణలో ఉందా? అని ప్రశ్నించారు

దమ్ముంటే ఏపీలో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేయండంటూ కేంద్రంలోని బీజేపీ అగ్రనేతలకు సీఎం రేవంత్ సవాల్ విసిరారు. అలాగే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లిం రిజర్వేషన్లు .. బీసీ కేటగిరిలో ఉన్నాయని గుర్తు చేశారు. ఎన్నికల కోసం మంద కృష్ణను బీజేపీ కౌగిలించుకుందన్నారు. అధికారంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ ఎందుకు చేయడం లేదంటూ బీజేపీ నేతలను ఆయన బల్లగుద్దీ మరి ప్రశ్నించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అడ్డు పడడం వల్లే తెలంగాణకి అన్యాయం జరుగుతోందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు.

# భాజపా పాలనలో అన్ని విధాలుగా అణచివేత: మంత్రి ఉత్తమ్

సమాజంలో అన్ని వర్గాలకు స్వేచ్ఛ, స్వాతంత్రం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. భాజపా పాలనలో దేశంలో అన్ని విధాలుగా అణచివేత కొనసాగుతోందని ఆరోపించారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. ఇప్పుడు జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమం అవసరమని వివరించారు. రాష్ట్రంలో కులగణన, ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. కుటుంబ సర్వేలో పాల్గొనని కేసీఆర్ కుటుంబం కూడా సామాజిక న్యాయం గురించి మాట్లాడుతోందని ఎద్దేవా చేశారు.

ఏడాది కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని.. ప్రచారం చేయడంలో కొంత వెనుకబడిపోయామని తెలిపారు. దేశం మొత్తంలో తెలంగాణలోనే ఈ ఏడాది ఎక్కువ ధాన్యం పండించినట్లు పేర్కొన్నారు. అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని.. ఇవన్నీ జనంలోకి తీసుకెళ్లి ప్రచారం చేసుకోవాలని వివరించారు. పీసీసీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు శుభవార్త.. వాళ్లందరి ఖాతాల్లోకి డబ్బులు.. డిప్యూటీ సీఎం కీలక ఆదేశాలు

మొదటి పేజీ తరువాయి

శుక్రవారం ఉదయం ప్రజాభవన్‌లో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్ రావు, డైరక్టర్ గోపీ సహా ఆర్థిక, వ్యవసాయ శాఖల అధికారులతో భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన భట్టి విక్రమార్క.. కీలక ఆదేశాలు జారీ చేశారు.

మూడెకరాలలోపు రైతు భరోసా లబ్ధిదారుల వివరాలను గ్రామాల్లో ఫ్లెక్సీల ద్వారా ప్రదర్శించాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. లబ్ధిదారుల వివరాలు గ్రామ కూడళ్లలో అందరికీ కనిపించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని భట్టి సూచించారు. అనంతరం.. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుతో కలిసి భట్టి విక్రమార్క బ్యాంకర్ల సమావేశంలో పాల్గొన్నారు. వ్యవసాయరంగానికి సంబంధించిన బ్యాంకింగ్ సేవలు, రుణాల మంజూరుపై చర్చించారు. రైతులకు అందుతున్న ఆర్థిక సాయం, పథకాల అమలు పురోగతిపై భట్టి విక్రమార్క సమీక్షించారు.

ఈ సమావేశంలో మాట్లాడిన భట్టి విక్రమార్క తెలంగాణ అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని.. ఇందులో బ్యాంకర్లు కీలక భాగస్వాములని పేర్కొన్నారు. స్కిల్ యూనివర్సిటీ, ఐటీఐల అడ్వాన్స్‌మెంట్ ద్వారా నైపుణ్యం కలిగిన మానవ వనరులను, ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా, శాంతి భద్రతలతో.. మంచి వాతావరణం కల్పించి ప్రపంచాన్ని ఆకర్షిస్తున్నామని చెప్పుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ కృషి ఫలితంగా దావోస్‌లో 1.80 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగినట్టు గుర్తుచేశారు.

వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని చెప్పడమే కాదు.. చేసి చూపించామని భట్టి విక్రమార్క తెలిపారు. ఒక్క వ్యవసాయ రంగానికే రూ.52 వేల కోట్లు కేటాయించినట్టు భట్టి పేర్కొన్నారు. 2 నుంచి 3 నెలల వ్యవధిలోనే రైతు రుణమాఫీ కింద సుమారు రూ.22 వేల కోట్లు రైతుల ఖాతాలో జమ చేశామని తెలిపారు. భారతదేశ చరిత్రలో ఇది ఒక రికార్డుగా అభివర్ణించారు. ప్రభుత్వ నిర్ణయంతో రైతులతో పాటు బ్యాంకర్లకు కూడా మేలు జరిగిందని, సింగిల్ ఖాతా ద్వారా రూ.22 వేల కోట్లు బ్యాంకుల్లో జమయ్యాయని.. సింగిల్ స్ట్రోక్‌తో పెద్ద మొత్తంలో బ్యాంకర్లకు రికవరీ జరిగిందని బ్యాంకర్లు ప్రభుత్వాన్ని అభినందించాలన్నారు.

రైతు భరోసా పథకం కింద ఇప్పటికే రూ.11,500 కోట్లు, రైతు బీమా కింద రూ.1,500 కోట్లు, రైతులకు ఉచిత విద్యుత్ పథకం కింద సబ్సిడీ మొత్తం రూ.11 వేల కోట్లు, సన్నవడ్లకు బోనస్‌గా రూ.1,800 కోట్లు, ఇవి కాకుండా కేంద్ర ప్రాయోజిత పథకాలు, వివిధ రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద రైతులకు ప్రయోజనం చేకూరుతుందని భట్టి విక్రమార్క తెలిపారు.

# దేశ రక్షణ బాధ్యత యువత పైనే ఉంది - సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

ఈ దేశ రక్షణ బాధ్యత యువతీ యువకులపై ఉందని చెప్పారు. బీడీఎల్, డీఆర్డీఓ, మిదానీ, హెచ్ఏఎల్ వంటి దేశ రక్షణ కోసం రాకెట్లు, మిస్సైల్స్ తయారు చేస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి హైదరాబాద్ నగరం, హైదరాబాద్ చుట్టూ పరిశ్రమలు ఉన్నాయన్నారు. లక్షలాది మంది విద్యార్థులకు దేశభక్తి , దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యతపై వారిలో స్ఫూర్తిని, అవగాహన కల్పించడానికి ఈ ప్రత్యేకమైన ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రతి ఏటా లక్షకుపైగా ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు, ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్ చదివి, అమెరికాకు వెళ్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. వారిలో దేశభక్తితో, దేశ రక్షణ ప్రాధాన్యతనలు వివరించడానికి ఈ వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నామని అన్నారు. తెలంగాణ నుంచి కేవలం ఐటీ ప్రొఫెషనల్స్ మాత్రమే అమెరికాకు వెళ్లకుండా, దేశ రక్షణ రంగానికి అవసరమైన సమర్థవంతమైన ఇంజినీర్లు అందించేందుకు ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.దేశ రక్షణ కోసం అవసరమైన ఇంజినీర్లను తయారుచేయడం మరింత ముఖ్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. స్వాతంత్ర్యానికి ముందు, ఆ తర్వాత కూడా హైదరాబాద్‌లో బీడీఎల్, హెచ్ఎచ్ఎల్, మిదాని, డీఆర్‌డీఓ వంటి అనేక సంస్థలు దేశ రక్షణ కోసం ఉత్పత్తి రంగంలో విశేషంగా పని చేస్తున్నాయని తెలిపారు. దేశ రక్షణ రంగానికి హైదరాబాద్, బెంగళూరు ముఖ్య కేంద్రాలుగా ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. గతంలో మీతో చర్చించినట్లుగా హైదరాబాద్-బెంగళూరు డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌గా ప్రకటించాలని.. తద్వారా భారీగా పెట్టుబడులు వస్తాయని అన్నారు. రాకెట్ తయారీ సహా ఆకాశ మార్గం (స్కై రూట్) వంటి స్టార్టప్‌లు అభివృద్ధి చెందుతాయని.. అందుకోసం కేంద్ర ప్రభుత్వ సహకారం, మద్దతు అవసరమని తెలిపారు. రక్షణ రంగంలో భారతదేశాన్ని నంబర్ వన్ స్థాయికి తీసుకెళ్లేందుకు తాము ప్రయత్నిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# వరంగల్ మామునూర్ ఎయిర్ పోర్ట్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్..

వరంగల్ జిల్లా మామునూర్ ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతిని మంజూరు చేసిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మామునూర్ ఎయిర్ పోర్ట్‌కు అనుమతిని మంజూరు చేస్తూ కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వశాఖ కార్యదర్శి అమిత్ కుమార్ జా, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్‌కు లేఖ ద్వారా తెలియజేసినట్లు మంత్రి తెలిపారు. మామునూర్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసి, తిరిగి కార్యకలాపాలు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విమానాశ్రయ ప్రాధికార సంస్థ అభ్యర్థనకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. గత పదేండ్లుగా పెండింగ్‌లో ఉన్న NOC అడ్డంకిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి జీఎంఆర్ సంస్థ యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి, బోర్డులో పెట్టి NOC ఇచ్చేలా చేశారు. దీంతో HAIL తన బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ మీటింగ్ ఏర్పాటు చేసుకొని మామునూర్ విమానాశ్రయ అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న 150 కిలోమీటర్ల నిబంధనను సవరిస్తూ NOC ఇచ్చారు. ఇప్పుడు ఈ NOC ని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఆమోదించిందని మంత్రి తెలిపారు. ఈ మేరకు కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వశాఖ కార్యదర్శి అమిత్ కుమార్ జా, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ కు లేఖ ద్వారా తెలిపినట్లు మంత్రి వివరించారు. దీంతో మామునూర్ ఎయిర్ పోర్టు నిర్మాణం మరింత వేగంగా ముందుకు సాగుతుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

**మామునూర్ ఎయిర్ పోర్ట్ గ్రాండ్ హిస్టరీ ఇదీ..**

దేశంలో1930లో ఏర్పాటు చేసిన వరంగల్ మామునూర్ ఎయిర్‌పోర్టు అప్పట్లో సౌత్ ఏషియాలోనే అతి పెద్దదిగా రికార్డుల్లో ఉంది. దాదాపు వెయ్యి ఎకరాల స్థలంలో విమానాల రాకపోకలతో 1981 వరకు కళకళలాడింది. చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్.. సొలాపూర్, కాగజ్ నగర్ వంటి ఏరియాల్లో వ్యాపారాలు చేసేందుకు ఇక్కడి నుంచే ప్రయాణాలు సాగించేవారు.రాష్ట్ర పర్యటనకు వచ్చే క్రమంలో రాష్ట్రపతులు, ప్రధాన మంత్రులు ఇక్కడే ఫ్లైట్ దిగేవారు. ఇండో-చైనా యుద్ధం నేపథ్యంలో టెర్రరిస్టులు ఢిల్లీ ఎయిర్ పోర్ట్ ను టార్గెట్ చేశారు. ఈ క్రమంలో మన విమానాలు పార్కింగ్ చేసేందుకు మామునూర్‌లో 1970లో పొడవాటి ఎయిర్‌షిప్ (హ్యాంగర్) నిర్మించారు. 1970 నుంచి 1977 మధ్యలో ఇక్కడి నుంచే వివిధ ప్రాంతాలకు వాయుదూత్ విమానాలు నడిపారు.

# పింకు బుక్‌ను మెయింటెన్ చేస్తున్నాం.. తస్మాత్ జాగ్రత్త..



సింగోటంలో లింగాకారంలో లక్ష్మీనరసింహస్వామి వారు ఉండడం అన్నది చాలా ప్రత్యేకమైనటువంటి క్షేత్రంగా గమనిస్తూ ఉన్నాము. తెలంగాణ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు స్వామివారి దగ్గరికి దర్శనం చేసుకోవడానికి వస్తూ ఉంటారని మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రత్యేకమైన క్షేత్రం కోసం కేసీఆర్ రూ. 17 కోట్లు మంజూరు చేస్తే మరి ఆ దేవుడికి ఇచ్చిన డబ్బులు కూడా జూపల్లి కృష్ణారావు క్యాన్సిల్ చేయడం అన్నది దౌర్భాగ్యం అన్నారు. ఒక ప్రభుత్వంలో ఇచ్చినటువంటి పథకాలు ఇంకొక ప్రభుత్వంలో కొనసాగాలి. దానివల్ల ప్రజలకు లాభం జరగాలి. కానీ ఏదో ప్రజల మీద కక్ష కట్టినట్లు దేవుడిపై కక్ష కట్టి కేసీఆర్ ఇచ్చినటువంటి రూ. 17 కోట్లను క్యాన్సిల్ చేయించడం చాలా దారుణమన్నారు. తక్షణమే క్యాన్సిల్ చేసినటువంటి డబ్బుల్ని తీసుకొని వచ్చి ఆలయ అభివృద్ధి కోసం జూపల్లి కృష్ణారావు కృషి చేయవలసిందిగా డిమాండ్ చేశారు.


కొల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున నిలబడ్డటువంటి ఏ నాయకుడైనా సరే ఒక ఫేస్‌బుక్‌లో చిన్న పోస్టులు పెట్టిన లేకపోతే ఏదైనా నిలబడి ప్రశ్నించిన కూడా కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నటువంటి ఘటనలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి బీఆర్ఎస్ నాయకులపై దాడులు జరుగుతున్నాయి. బీఆర్ఎస్ కార్యకర్త శ్రీధర్ రెడ్డిని చంపడం కూడా జరిగింది. అయినప్పటికీ ముఖ్యమంత్రి సొంత జిల్లా అయినా జూపల్లి కృష్ణారావు మంత్రివర్గంలో ఉన్నప్పటికీ కూడా పోలీస్ వాళ్ళ కేసు మీద పురోగతి లేకపోవడం అన్నది చాలా దారుణమని కేవలం ప్రభుత్వానికి హంతకులకు కొమ్ముగాస్తున్నారు తప్పితే ప్రజల పక్షాన మీరు నిలబడలేదని విమర్శించారు. జూపల్లి కృష్ణారావు టూరిజం మంత్రిగా కాకుండా కొల్లాపూర్ నియోజక వర్గానికి అప్పుడప్పుడు వస్తూ టూరిస్ట్ మంత్రిగా వ్యవహారం చేస్తున్నారని ఎద్దేవ చేశారు.

నియోజకవర్గంలో పండే మామిడికాయలను దేశంలోని నలుమూలాలతోపాటు ఇతర దేశాలకు కూడా ఎగుమతి జరుగుతుంటాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో కొల్లాపూర్ ప్రాంతంలో మామిడి మార్కెట్ మంజూరు చేస్తే ఈ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అభివృద్ధి ఎక్కడ కూడా కనబడడం లేదు.. పదేపదే ప్రభుత్వం ఊదరగొడుతూ రైతుబంధు రుణమాఫీ అని చెప్పారు. కానీ ఇంతవరకు పూర్తిస్థాయిలో ఎక్కడ అమలు జరగలేదు. జనవరి 26 తేదీలోపు టకీటకీ మని రైతు భరోసా డబ్బులు పడతాయన్నారు. ఇప్పుడు మళ్లీ మార్చి 30 అని చెప్తున్నారు. కనీసం ఆ తేదీలోపైన రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలన్నారు. ప్రభుత్వము రైతులను, విద్యార్థులను ఆదుకుంటలేదన్నారు. ఇతర పార్టీ నాయకులపై కక్ష కట్టి వారిపై ఆగడాలకు పడుతున్నారన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి చేయకుండా బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు.

నిన్న రాత్రి సాతపూర్ గ్రామంలో ఇవాళ మీటింగ్ కోసం ఫ్లెక్సీ కడుతుంటే బీఆర్ఎస్ కార్యకర్త పరమేష్‌పై దారుణంగా 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు కలసి దాడి చేశారన్నారు. నీతి నిజాయితీగా పనిచేసి కొట్లాడి తెలంగాణను తీసుకొచ్చామన్నారు. ప్రతిపక్షాల మీద దాడి చేస్తే ఏమొస్తుందన్నారు. ముఖ్యమంత్రి మీ మహబూబ్‌నగర్ జిల్లా గడ్డ మీద నుంచి చెప్తున్నాను. మేము కూడా పింకు బుక్ మెయింటెన్ చేస్తాము. కార్యకర్తలపై నాయకులపై దాడి చేసిన వారి చిట్టా రాస్తాం మా టైం వచ్చినప్పుడు చెప్తామని ఆమె హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాష్, దూ రెడ్డి రఘువర్ధన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# పరాకాష్టకు చేరిన ప్రజాపాలన.. విషాదంలో మంత్రుల వినోదం : కేటీఆర్

మొదటి పేజీ తరువాయి



కొండనాగులలోని ఎస్టీ బాలుర హాస్టల్‌లో శివరాత్రి పండుగ రోజు 380 మందికి గాను 200 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే మధ్యాహ్న భోజనం గుదిబండ శివాలయంలో చేసే అన్నదానానికి వెళ్ళి తినాలని, రాత్రి భోజనం కోసం వీరం రామాజిపల్లిలోని గంగమ్మ దేవాలయంలో అన్నదానానికి వెళ్లి తినమని విద్యార్థులకు చెప్పి హాస్టల్ సిబ్బంది వంట చేయడం మానేశారని కేటీఆర్ తెలిపారు.

భోజనం కోసం అంత దూరం నడిచి వెళ్ళే ఓపిక లేక విద్యార్థులు పస్తులు ఉన్నారని కేటీఆర్ పేర్కొన్నారు. పండగ పూట విద్యార్థులకు కనీసం భోజనం పెట్టకుండా, అన్ని కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్ళి తినమని చెప్పడం ఏంటి అని విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పండగపూట విద్యార్థులను పస్తులుంచడమే ప్రజాపాలనా అని కేటీఆర్ ప్రశ్నించారు.

# మాజీ మంత్రి హరీష్ రావుపై మరో కేసు నమోదు

మొదటి పేజీ తరువాయి

కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఏ -1 గా వంశీ కృష్ణ , ఏ -2 గా హరీష్ రావు, ఏ-3 సంతోష్ కుమార్ , ఏ -4 గా పరుశురాములు పేర్లు చేర్చారు. బీఎస్ఎన్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసిన బాచుపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయి బెయిల్‌పై విడుదల అయిన సమయంలో వంశీకృష్ణ జైలు వద్ద మీడియాతో మాట్లాడారని దర్యాప్తు చేస్తున్న పంజాగుట్ట పోలీసులను విమర్శించడంతోపాటు.. తనపై ప్రతీకారం తీర్చుకుంటామని వంశీకృష్ణ మాట్లాడినట్లు చక్రధర్ గౌడ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే వంశీకృష్ణ చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి అభ్యంతకరమైన మాటలు లేవని తనను అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపించారని.. న్యాయపోరాటం కొనసాగిస్తానని చెప్పడంవలనే తనపై అక్రమంగా కేసులు పెట్టారని వంశీ చెబుతున్నారు.

కాగా ఈ కేసుకు సంబంధించి పోలీసుల దర్యాప్తు ఎలా ఉండబోతోందో చూడాలి.గత ప్రభుత్వానికి అడ్డు తగిలిన వ్యక్తులను ఒక్కొక్కరిగా చంపేసుకుంటూ వస్తున్నారని, వాళ్లకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందని ఆ పార్టీ నేత చక్రధర్ గౌడ్ అన్నారు. తనకూ ప్రాణహాని ఉందని తన అంతుచూస్తామంటూ సోషల్ మీడియా వేదికగా బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజం కోసం కొట్లాడుతున్న గొంతుకలను కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. చావు ఏదో ఒకరోజు తప్పదు. కానీ సమాజం కోసం పోరాడి చావడానికి సిద్ధమేనన్నారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా వ్యక్తి స్వేచ్ఛను హరించారని కోర్టు మెట్లెక్కిన మొట్టమొదటి వ్యక్తిని తానేనన్నారు. కేసు వెనక్కి తీసుకోమని కొన్ని శక్తులు తనను వెంటాడుతున్నాయన్నారు. ఈ క్రమంలో తనకు ఏమౌతుందోనని తన కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారని ఆయన అన్నారు.కాగా మాజీ మంత్రి హరీష్‌రావు తన ఫోన్‌తో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితుల ఫోన్‌లను ట్యాప్ చేయించాడని సిద్దిపేట కాంగ్రెస్ నేత చక్రధర్‌గౌడ్ ఆరోపించారు. తన ఫోన్ ట్యాప్ అయిందంటూ గత ఏడాది జూన్ 19న చక్రధర్‌గౌడ్ డీజీపీకి ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు పట్టించుకోకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు చక్రధర్‌గౌడ్‌ను గతంలో విచారించిన పోలీసులు సరైన ఆధారాలు తీసుకు రావాలని సూచించారు.ఈ మేరకు చక్రధర్‌గౌడ్ జూబ్లీహిల్స్ ఏసీపీని కలిసి ట్యాప్ అయినట్టు అనుమానిస్తున్న సెల్‌ఫోన్‌తో పాటు యాపిల్ కంపెనీ నుంచి ఫోన్ ట్యాప్ అయిందని వచ్చిన మెయిల్ కాగితాలు, ఇతర వివరాలను విచారణ అధికారులకు అందచేశారు. హరీశ్‌రావుకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాననే కక్షతో తనపై అనేక కేసులు పెట్టి జైలుకు పంపించారని చక్రధర్‌గౌడ్ ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రంగనాయకసాగర్

# నా మూడు ప్రశ్నలకు హరీశ్‌రావు సమాధానం చెప్పాలి: మంత్రి జూపల్లి

ఎస్ఎల్‌బీసీ వద్ద ప్రమాదం వ్యవహారంలో రాజకీయ దురుద్దేశంతోనే మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు చేస్తున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన భారాస.. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును ఎందుకని పెండింగ్ పెట్టిందని ప్రశ్నించారు. ఈ మేరకు గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు.

"హరీశ్‌రావును నేను సూటిగా ప్రశ్నిస్తున్నా. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను 200 మీటర్లు తవ్వి మిగతాది ఎందుకు వదిలేశారు? తక్కువ లాభం వస్తుందనా? టన్నెల్ నిర్మాణం పూర్తి అయితే కాంగ్రెస్‌కు పేరు వస్తుందనా? నా మూడు ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పాలి. ప్రకృతి విపత్తులనూ భారాస నేతలు రాజకీయంగా వాడుకుంటున్నారు. అతి తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ఎస్ఎల్‌బీసీని ఎందుకు పెండింగ్‌లో పెట్టారు? ఈ ప్రాజెక్టు గురించి మాట్లాడే హక్కు భారాసకు లేదు. అద్భుతం జరిగితే తప్ప టన్నెల్‌లో చిక్కుకున్న 8 మంది బతికే అవకాశం లేదు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదం జరిగినప్పుడు పనులు చేపట్టిన సంస్థ ప్రతినిధులు అప్రమత్తం చేసి ఉండకపోతే 40 మంది వరకు కార్మికులు చనిపోయేవారు" అని మంత్రి పేర్కొన్నారు.

## పాఠశాలలో మధ్యాహ్నం భోజనం

# ఆకస్మిత తనిఖీ చేసిన కీర్తి



మోత్కూర్ 28ఫిబ్రవరి( క్రాంతి న్యూస్)యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నాణ్యతను సమీక్షించే రెండో విడత తనిఖీ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ క్రమంలో, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, కొండగడపలో మధ్యాహ్న భోజన తయారీని శుక్రవారం వి. కీర్తి, మోత్కూరు మండల వ్యవసాయాధికారి, పరిశీలించారు. ఈ తనిఖీ సందర్భంగా ఆమె వంటశాలలో పరిశుభ్రత, ఆహార నాణ్యత, పోషక విలువలు, వంట సామగ్రి నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న భోజనం సరిపోతుందా లేదా అనే అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనంపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అధికారుల ఆకస్మిక తనిఖీ కారణంగా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత మరింత మెరుగుపడే అవకాశం ఉందని, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన మార్పులు చేయడానికి చర్యలు తీసుకుంటామని కీర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు గంధం శ్రీనివాసరావు, ఏ. సత్తయ్య, పి. రాములు లు పాల్గొన్నారు.

# ఎస్. ఎస్.టి, సంస్థ ఆధ్వర్యంలో వారోత్సవాలు

## ముసిపట్ల గ్రామంలో అవగాహన సదస్సు




మోత్కూర్ 28 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): యాదాద్రి జిల్లా మోత్కూర్ మండలం ముసిపట్ల గ్రామంలో ఎస్.ఎస్.టి,( సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్) ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులకు ఆర్థిక వివేకాన్ని పెంపొందించేలా పలు అంశాలపై అవగాహన కల్పించారు. పార్టిసిపెంట్‌లకు బడ్జెట్ నిర్వహణ చిట్కాలు, అకౌంట్ ఓపెనింగ్ విధానం, మైక్రో సేవింగ్ ప్రాధాన్యత, వినియోగదారుల రక్షణ చట్టాలు వంటి కీలక విషయాలను వివరించారు. ఈ కార్యక్రమం గ్రామస్తుల్లో ఆర్థిక సురక్షితతను పెంపొందించేందుకు దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. స్థానిక అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఆసక్తి కనబరిచారు. ఆర్థిక అక్షరాస్యత పెరిగితే వ్యక్తిగతంగా, సమాజపరంగా ఎంతో మేలు జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిజిబి ఫీల్డ్ ఆఫీసర్ అమృతరాజు, కౌన్సిలర్లు యుగంధర్, మహేష్, నగేష్,దామోదర్ రెడ్డి, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## మోత్కూర్ తహసీల్ కార్యాలయం,

# తనిఖీ చేసిన ఆర్డీవో కృష్ణారెడ్డి

మోత్కూర్ 28 ఫిబ్రవరి( క్రాంతి న్యూస్)భువనగిరి రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్‌డిఓ) కృష్ణా రెడ్డి శుక్రవారం మోత్కూర్ తహసీల్ కార్యాలయం మరియు సివిల్ సప్లై గోదాంను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీ సందర్భంగా తహసీల్ కార్యాలయంలో భూమి రికార్డుల నిర్వహణ, పటాలు, పట్టాదారు పాసుపుస్తకాలు, ఫైలుల స్థితి, ప్రజలకు అందుతున్న సేవలు మొదలైన అంశాలను పరిశీలించారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడి ప్రజలకు ఎదురవుతున్న సమస్యలు, అభ్యంతరాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఫైలుల క్లియర్‌చేయడంలో జాప్యం లేకుండా చూడాలని, ప్రజలకు సులభతర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తదనంతరం సివిల్ సప్లై గోదాంను సందర్శించిన ఆర్‌డిఓ, గోదాంలో





ఉంచిన బియ్యం నిలువలు, సరఫరా, నాణ్యత, భద్రతా ప్రమాణాలు, తూకాల పరిశీలన, సరైన రికార్డు నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారు. అనుమానాస్పదంగా ఉన్న నిల్వలపై విచారణ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అక్రమాలు జరిగినట్టయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## మోత్కూర్ మండల టి.యూ.డబ్ల్యూ జె (ఐ జె యూ)

# నూతన కమిటీ ఎన్నిక




మోత్కూర్ 28 ఫిబ్రవరి( క్రాంతి న్యూస్)మోత్కూర్ మండల కేంద్రంలో టి యూ డబ్ల్యూ జె ( ఐ జె యూ) నూతన కమిటీని శు క్రవారం స్థానిక గ్రంథాలయంలో యూనియన్ జిల్లా మాజీ కార్యదర్శి ,జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు వెల్మినేటి జహంగీర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా ధబ్బేటి సోంబాబు,అధ్యక్షులుగా ఆకవరం శ్రీనివాసులు,ప్రధాన కార్యదర్శి గా మాశెట్టి వెంకన్న,ఉపాధ్యక్షులుగా గంట శ్రీనివాస్ రెడ్డి, సహాయ కార్యదర్శి గా బుంగపట్ల యాకయ్య,కోశాధికారి గా గుండు ప్రసాద్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ని యూనియన్ నాయకులు శాలువలతో ఘనంగా సన్మానించారు. నూతన అధ్యక్షుడు ఆకవరం శ్రీనివాసులు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నెరవేరుస్తానని,జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సీనియర్ సభ్యులు ,గౌరవ సలహాదారులు కాయితాల నర్సిరెడ్డి, ఎస్ ఎన్ చారి, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా సహాయ కార్యదర్శి కాపర్తి సైమన్, మండల కమిటీ ప్రతినిధులు ఎం డి షాకీర్,చేపూరి అనిల్ ,ధబ్బేటి రమేష్,గాదేనబోయిన నాగరాజు,వారాల నరేష్,పోచం కన్నయ్య,నర్రె సురేష్,ముషం శ్రీను,బుంగపట్ల యాకయ్య,గోవర్ధన్ రెడ్డి,సూరారం నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

## నిరందక ఎండిపోయిన పంటపొలాలకు

# నష్టపరిహారం ఇవ్వాలి

## సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు



మోత్కూర్ 28 ఫిబ్రవరి( క్రాంతి న్యూస్)యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ పరిధిలోని భూగర్భ జలాలు అడిగంటి నిరందక ఎండిపోయిన పంటపొలాలకు ప్రభుత్వం ఎకరానికి 25 వేల రూపాయల చొప్పున నష్ట పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోత్కూర్ మండలం పాలడుగు గ్రామంలో బావిలో నీరు అడిగంటి ఎండిపోయిన దడిపల్లి సైదులు, వరిపొలాన్ని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. మండలం లోని ఫలు గ్రామాలలో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు, బావులు ఎండిపోయి వరిపంట ఎండిపోయిందని, ఎంతో ఆశతో ఎకరానికి దాదాపు 30 వేల రూపాయల పెట్టుబడి పెట్టి, రెండు నెలల పాటు కష్టపడి వరిపంట వేస్తే, నిండు పొట్ట దశలో నీళ్ళులేక నిలువునా ఎండిపోయిందని, రైతులు దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అధికారులతో క్షేత్ర స్థాయిలో సర్వే చేయించి పంట ఎండిపోయి,నష్ట పోయిన రైతులకు ఎకరానికి 25 వేల రూపాయల చొప్పున నష్ట పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు, ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, శాఖ కార్యదర్శి పిట్టల చంద్రయ్య, సహాయ కార్యదర్శి కొంపల్లి గంగయ్య, వెండి యాదగిరి, చింతకింది సోమరాజు, వడ్డేపల్లి లక్ష్మణ్, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు,

## ఆర్ ఎఫ్ సి ఎల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లిన

## ఆర్ ఎఫ్ సి ఎల్ కాంటాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షులు నెలకంటి రాము



రామగుండం ,28 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): గోదావరిఖని: స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆర్ సి ఎల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షులు నేలకంటి రాము ఆధ్వర్యంలో కార్మికుల తో కలిసి రామగుండం నియోజకవర్గం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ను కలసి ఆర్ ఎఫ్ సి ఎల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.. ఆర్ ఎఫ్ సి ఎల్ కాంట్రాక్టు కార్మికులకు అండగా ఉంటానని మీ సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని మరియు ఢిల్లీలో ఉన్న ఆర్ ఎఫ్ సి ఎల్ కార్యాలయానికి వెళ్లి అధికారులతో మాట్లాడి మీ సమస్యలను పరిష్కరిస్తానని కార్మికులకు హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిట్టబోయిన రాజ్ కుమార్, మాజీ కార్పొరేటర్ కందుల సతీష్ హెూటల్ శంకర్ మల్లేష్ రమేష్ రెడ్డి ఎరుకల అంజి,దాత శ్రీనివాస్, దూస రాజేష్, జనగామ శ్రీనాథ్, సొల్లు కుమార్, శ్రీనివాస్, తరుణ్, మరి కుమారస్వామి, శ్రీనివాస్ ఆనంద్, జస్వంత్, బిక్షపతి,ఫిరోజ్ అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు

# సిబ్బంది భద్రతా ప్రమాణాలు పాటించాలి

## ములుగు డిఈఈ పులుసం నాగేశ్వర్రావు





ములుగు జిల్లా ప్రతినిధి ,28 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ములుగు సెక్షన్, మల్లంపల్లి సెక్షన్ ఖేత్రస్థాయి విద్యుత్ ఉద్యోగులకు టూల్ కిట్లు, సేఫ్టి కిట్లు ములుగు డి ఈ ఈ పులుసం నాగేశ్వర్రావు అధ్యరంలో శు క్రవారం డివిజన్ ఆఫీస్ ములుగు యందు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎండి ఆదేశానుసారం విద్యుత్తు ఉద్యోగుల భద్రతా ప్రమాణాలను మెరుగు పరచడానికి టూల్ కిట్లు అందజేయయడం జరిగిందని ప్రతి లైనులో పనిచేసే ప్రతి సిబ్బంది భద్రతా ప్రమాణాలు పాటించాలని , వేసవిలో నిరంత విద్యుత్తు వినియోగ దారులకు అందజేయాలని ఈ సందర్భంగా ఉద్యోగులను ఆదేశించడమైనది. ఈకార్యక్రమంలో ఏడిఈ ములుగు వేణుగోపాల్ , ములుగు ఏ ఈ బానోతు రవి, ములుగు, మల్లంపల్లి ఖేత్రస్థాయి విద్యుత్తు ఉద్యోగులు పాల్గొన్నారు.

# అనుమతి లేని హెూర్డింగ్స్..

# రేప్పపాటులోనే ప్రమాదాలు

**దారి పొడుగునా ఉన్న హెూర్డింగ్ ఫ్లెక్సీలతో ప్రయాణికులకు ఇబ్బందులు**




భద్రాద్రి కొత్తగూడెం ,28 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్ ): చుంచుపల్లి మండలం రుద్రంపూర్ గ్రామపంచాయతీ సెక్రెటరీ మండల అధికారులకు రోడ్డుకు ఇరువైపులా హెూర్డింగ్ ఫ్లెక్సీలు కడుతున్న చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. రోడ్డు వెంబడి ఇలా ఎవరిష్టం వచ్చినట్టు వాళ్ళు ఫ్లెక్సీలు పెట్టుకోవడం , వీటివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి.

రోడ్డు పైన వెళ్లే వాహనదారులు ఫ్లెక్సీలు చూసుకుంటూ డ్రైవ్ చేయడం వలన రెప్పపాటులో ప్రమాదాలు జరుగుతున్నాయి.. దయచేసి అధికారులు కల్పించుకొని అనుమతులు లేకుండా నిర్మించిన ఈ హెూల్డింగ్స్ అన్నిటిని తీసివేయాలని ప్రజలు కోరుతున్నారు . ఫ్లెక్సీ లు కట్టాలంటే పంచాయతీ అనుమతి తీసుకోవాలి పంచాయతీలకు పన్ను కట్టాల్సిన అవసరం ఉన్నది.. ఇటువంటివి ఏమీ లేకుండా ఇష్టాను సారంగా హెూర్డింగ్సు ఎవరికి నచ్చిన రీతిగా వాళ్ళు ఏర్పాటు చేసుకుని ప్రమాదాలకు కారకులవుతున్నారు.. ఏదైనాప్పటికీ చుంచుపల్లి మండలంలో రుద్రంపూర్ మొదలుకొని కొత్తగూడెం వరకు ఇలా రోడ్డు వెంబడి అనుమతులు లేని హెూర్డింగ్సు ఫ్లెక్సీలు ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. ప్రమాదాలు జరిగినాక అయ్యో అని సానుభూతి చూపించే అధికారులు.. వెంటనే స్పందించి ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన అవసరం ఉన్నది అని ప్రజలు కోరుతున్నారు.



# ఏపీ వాసులకు బిగ్ అలర్ట్..

**-మార్చి ఒకటి నుంచి కొత్త రూల్స్..**

**- అతిక్రమిస్తే జేబుకు చిల్లే!**



ఆంధ్రప్రదేశ్ వాసులకు ముఖ్య గమనిక. మార్చి ఒకటి నుంచి రూల్స్ మారనున్నాయి. నిబంధనలు అతిక్రమిస్తే మీ జేబుకు చిల్లు పడే అవకాశం ఉంది. మార్చి ఒకటో తేదీ నుంచి ఏపీలో కొత్త మోటార్ వెహికల్ చట్టం అమలు చేయడానికి అధికారులు సిద్ధమయ్యారు. నూతన మోటారు వాహనాల చట్టం ప్రకారం హెల్మెట్ ధరించడం తప్పనిసరి. హెల్మెట్ ధరించకపోయినా, ట్రాఫిక్ రూల్స్ పాటించకపోయినా భారీ జరిమానా విధించనున్నారు. హెల్మెట్ లేకుండా ద్వి చక్ర వాహనం నడుపుతూ పట్టుబడితే రూ. 1,000 జరిమానా విధించనున్నారు. అలాగే సీట్ బెల్ట్ పెట్టుకోకుండా కార్లు నడిపితే వేయి రూపాయలు జరిమానా విధిస్తారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులలో పట్టుబడితే భారీ జరిమానాలు విధించనున్నారు. ఇలాంటి కేసులో రూ. 10,000 జరిమానా, లైసెన్స్ రద్దు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

వీటితో పాటుగా అతి వేగం, సిగ్నల్ జంప్, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి కేసులలో వేయి రూపాయల వరకూ జరిమానా విధిస్తారు. ఇక డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడితే రూ. 5000 జరిమానాతో పాటుగా వాహనం సీజ్ చేసే అవకాశం ఉందని ట్రాఫిక్ అధికారులు హెచ్చరిస్తున్నారు. సీసీ కెమెరాల ద్వారా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిని గుర్తించి జరిమానాలు విధించనున్నారు. ఈ నేపథ్యంలో వాహనదారులు నిబంధనలు లోబడి నడుచుకోవాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని అధికారులు కోరుతున్నారు.

మరోవైపు ఏపీ హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో హెల్మెట్ విషయంలో ఏపీ పోలీసులు కఠినంగా వ్యవహరించనున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న బైక్ యాక్సిడెంట్లపై ఏపీ హైకోర్టు ఇటీవల విచారణ నిర్వహించింది. ఈ తరహా ప్రమాదాల్లో ఎక్కువ మంది చనిపోవటంపై ఆందోళన వ్యక్తం చేసిన హైకోర్టు. హెల్మెట్ ధరించి ఉంటే బాధితుల్లో ఎక్కువ శాతం మంది బతికి ఉండేవారని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో హెల్మెట్ వాడకం తప్పనిసరి చేయాలని పోలీసులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేయాలని ఏపీ పోలీసులు భావిస్తున్నారు. అలాగే మోటార్ వాహనాల చట్టాన్ని కూడా పకడ్బందీగా అమలు చేయాలని భావిస్తున్నారు.

# పోసాని రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు..!



సినీ నటుడు పోసాని కృష్ణ మురళిని ఏపీ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా పోసాని కృష్ణ మురళి కేసుకు సంబంధించిన రిమాండ్ రిపోర్టును పోలీసులు రైల్వే కోడూరు కోర్టుకు సమర్పించారు. పోసాని కృష్ణ మురళి రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కులాలు, వర్గాలపై గతేడాది తాను తీవ్ర వ్యాఖ్యలు చేసినట్లు పోసాని కృష్ణ మురళి పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో అంగీకరించినట్లు తెలిసింది. అలాగే పవన్ కళ్యాణ్, నారా లోకేష్ కుటుంబ సభ్యులను కూడా దూషించినట్లు పోసాని అంగీకరించారని సమాచారం. వైసీపీకి చెందిన ఓ ముఖ్య నేత స్క్రిప్ట్ మేరకే తాను విమర్శలు చేశానని పోసాని కృష్ణ మురళి చెప్పినట్లు పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. అలాగే ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా వైసీపీకి మద్దతుగా పనిచేశానని పోసాని కృష్ణ మురళి చెప్పినట్లు పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

మరోవైపు రాజకీయ పార్టీలు, అభిమానులు, కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించారంటూ పోసాని కృష్ణ మురళిని ఏపీ పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు కోర్టులో హాజరుపరచగా.. కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో మార్చి 12 వరకు పోసాని కృష్ణ మురళి రాజంపేట సబ్‌జైలులో రిమాండ్ ఖైదీగా ఉండనున్నారు. మరోవైపు పోసాని కృష్ణ మురళిని కస్టడీకి ఇవ్వాలంటూ ఓబులవారిపల్లె పోలీసులు రైల్వే కోడూరు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా పోసాని కృష్ణ మురళిని సమగ్ర విచారణ చేయాల్సి ఉందని పోలీసులు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే పోసానిని ఐదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోరారు. అయితే పోలీసుల పిటిషన్‌ను రైల్వే కోడూరు కోర్టు సోమవారానికి వాయిదా వేసింది.

మరోవైపు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పోసాని కృష్ణమురళిపై 14 కేసులు నమోదైనట్లు తెలిసింది. ఇందులో నాలుగు కేసులలో పోసాని కృష్ణ మురళికి వ్యతిరేకంగా పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. మరోవైపు పోసాని కృష్ణ మురళిని బుధవారం హైదరాబాదులో అరెస్టు చేసిన సమయంలో అరెస్ట్ ఇంటిమేషన్ కాపీని పోసాని కృష్ణ మురళి కుటుంబ సభ్యులు తీసుకోలేదు. దీంతో పోసాని కృష్ణ మురళి తనయుడికి అరెస్ట్ ఇంటిమేషన్ కాపీని వాట్సాప్ ద్వారా పంపించినట్లు పోలీసులు రైల్వే కోడూరు కోర్టుకు తెలిపారు.

# తిరుమలలో శ్రీవారి భక్తులకు ఒకరోజు అన్నదానానికి ఎంత ఖర్చవుతుందంటే?



తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు నిత్యం వేలాది మంది భక్తులు సుదూర ప్రాంతాల నుంచి తరలి వస్తుంటారు. ఎన్నో వ్యయ ప్రయాసలకు వోర్చి శ్రీవారిని దర్శించుకుంటూ ఉంటారు. శ్రీవారి దర్శనం కోసం కిలోమీటర్ల దూరం నుంచి తిరుమలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా టీటీడీ చర్యలు తీసుకుంటూ ఉంటోంది. దర్శనం దగ్గర నుంచి వసతి, అన్నప్రసాదాలు ఇలా ప్రతీ విషయాన్ని చాలా జాగ్రత్తగా పర్యవేక్షిస్తూ ఉంటుంది. ఇక తిరుమల శ్రీవారి భక్తుల ఆకలి తీర్చేందుకు తిరుమలలో నిత్యాన్నదానం జరుగుతూ ఉంటుందనే సంగతి తెలిసిందే. అయితే తిరుమలలో ఒకరోజు అన్నదానానికి ఎంత ఖర్చవుతుందనేదీ తెలుసా..

తిరుమల శ్రీవారి భక్తుల కోసం టీటీడీ అనేక కార్యక్రమాలు చేపడుతూ ఉంటుంది. శ్రీవారి దర్శనం దగ్గర నుంచి శ్రీవారికి సేవ చేసుకునే వరకూ వివిధ కార్యక్రమాలు అమలు చేస్తూ ఉంటుంది. స్వామి వారి సేవలో పాల్గొని తరించాలనుకునే భక్తులు చాలా మంది టీటీడీని సంప్రదిస్తూ ఉంటారు. అయితే తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చే లక్షలాది మంది భక్తులకు రుచిగా, శుచిగా అన్న ప్రసాదం అందించాలనుకునే భక్తుల కోసం టీటీడీ ఓ పథకం అమలు చేస్తోంది. తిరుమలలో ఒక రోజు అన్నప్రసాదాలు అందించేందుకు టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టు ఒక రోజు విరాళ పథకం ప్రారంభించింది. తిరుమలలో ఒకరోజు పూర్తిగా అన్నప్రసాద వితరణ చేయాలనుకునే భక్తులు రూ. 44 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని టీటీడీ తెలిపింది.

44 లక్షల రూపాయలు విరాళంగా అందిస్తే ఆ దాతల పేరు మీద ఒక రోజు శ్రీవారి భక్తులకు అన్న ప్రసాదాన్ని అందిస్తారు. ఇందులో ఉదయం అల్పాహారం కోసం రూ. 10 లక్షలు, మధ్యాహ్నం భోజనం కోసం రూ. 17 లక్షలు, రాత్రి భోజనం కోసం రూ. 17 లక్షలు ఖర్చు చేయనున్నారు. అలాగే దాతలు స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించే అవకాశాన్ని కూడా టీటీడీ అందిస్తోంది. విరాళం అందించే దాతల పేర్లను కూడా ప్రదర్శిస్తారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో దాతల పేర్లను ప్రదర్శిస్తారు. తిరుమలలో అన్నప్రసాదం వితరణ చేయాలనుకునే భక్తులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, మరిన్ని వివరాలకు తమను సంప్రదించాలని టీటీడీ ఓ ప్రకటనలో కోరింది.

# పురుషులకు శుభవార్త అందించిన ఏపీ ప్రభుత్వం.. ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం



మహిళా సంక్షేమం కోసం తెలంగాణ, ఏపీతో పాటు కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రారంభించింది. వారికి స్వయం ఉపాధి కల్పించడంతో పాటు.. ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశ్యంతో పొదుపు సంఘాలకు రుణాలను మంజూరు చేస్తోంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మహిళలకు డ్వాక్రా గ్రూపులు ఉన్నట్లుగానే ఏపీలో పురుష కార్మికులకు కూడా పొదుపు సంఘాలు ఏర్పాటు కానున్నాయి. వీరికి కూడా రుణాలను మంజూరు చేయనున్నారు.

1982లో ప్రారంభించిన డ్వాక్రా పథకం గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంత మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఎంతో తోడ్పాటును అందిస్తోంది. ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడమే కాకుండా.. స్వయం ఉపాధి అవకాశాలను ఈ పథకం కల్పిస్తుంది. ఈ పథకంలో మహిళలకు చాలా తక్కువ వడ్డీతో రుణాలను మంజూరు చేస్తారు.

దీని మాదిరిగానే పట్టణాల్లో అసంఘటిత రంగంలో పనిచేసే పురుషుల కోసం స్వయం శక్తి బృందాలు ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా కేంద్ర ప్రభుత్వం రుణాలను అందించనుంది. దీనిలో భాగంగానే పురుషుల కోసం ప్రత్యేకంగా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధమైంది.

దేశవ్యాప్తంగా ఈ పథకం ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానుంది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నంలో ఇప్పటికే పైలెట్ ప్రాజెక్ట్ కింద 2,841 గ్రూపులను ఏర్పాటు చేసినట్లు మెప్మా అధికారులు పేర్కొన్నారు. నేషనల్ అర్బన్ లైవ్‌లీవుడ్ మిషన్ 2.0 కొత్త గైడ్‌లైన్స్ ప్రకారం.. మహిళలు ఎలాగైతే స్వయం సహాయక గ్రూపులుగా ఏర్పడి రుణాలు పొందుతున్నారో.. అలానే పురుషులకు కూడా రుణాలను అందించేందుకు తోడ్పాటు అందిస్తామని తెలిపారు. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ఈ పథకం రూపొందించినట్లు మెప్మా అధికారులు తెలిపారు.

డ్వాక్రా సంఘంలోని మహిళలు గ్రూపుగా ఏర్పడిన విధంగా.. పురుషులు కూడా కనీసం 5 మందితో గ్రూప్ ఏర్పాటు చేసుకోవచ్చు. గరిష్టంగా ఎంత మందైనా ఈ గ్రూపులో చేరవచ్చు. ఇలా ఒక గ్రూపుగా ఏర్పడిన వారికి మాత్రమే బ్యాంకులు రుణాలను మంజూరు చేస్తాయి. దీనిని వాయిదాల రూపంలో బ్యాంకులకు తిరిగి చెల్లించవచ్చు. ప్రతి ఒక్కరూ కనీసం రూ. 100 పొదుపు చేయాల్సి ఉంటుంది.

ఉదాహరణకు ఐదుగురు సభ్యులున్న గ్రూపులో రూ. 500 పొదుపుతో మూడు నెలల పాటు క్రమం తప్పకుండా పొదుపు చేస్తే, రివాల్వింగ్ ఫండ్ కింద రూ. 25 వేలు మంజూరు చేస్తారు. వీటిని ఆరు నెలల పాటు క్రమంతో తప్పకుండా పొదుపు చేస్తే, ఫస్ట్ లింకేజీ కింద బ్యాంకులు ఆరు రెట్లు రుణం అందిస్తాయి. రుణాలు అందుకున్న పురుషులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వడ్డీని మాఫీ చేస్తాయి. వీటికి భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులతో పాటు.. రిక్షా కూలీలు, తోపుడు బండ్లు నడిపే వారు, గిగ్ వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులు, కేర్ వర్కర్స్ అర్హులుగా ఉంటారు.

# 3.22 లక్షల కోట్లతో ఏపీ బడ్జెట్..

**వ్యవసాయానికి 48 వేల కోట్లు**

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం తొలిసారిగా పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను శాసనసభలో మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారు. రూ. 3 లక్షల 22 వేల కోట్ల అంచనా వ్యయంతో బడ్జెట్‌ను సభ ముందుకు తీసుకొచ్చారు. ఇందులో వ్యవసాయానికి రూ. 48 వేల కోట్లు కేటాయించారు. రెవెన్యూ వ్యయం రూ. 2,51,162 కోట్లు, మూలధన వ్యయం అంచనా రూ. 40,635 కోట్లు, రెవెన్యూ లోటు రూ. 33,185 కోట్లు, ద్రవ్యలోటు రూ. 79,926 కోట్లుగా అంచనా వేశారు.

శాఖల వారీగా కేటాయింపులు..

పోలవరం ప్రాజెక్టుకు- రూ. 6,705 కోట్లు
అన్నదాత సుఖీభవ- రూ. 6,300 కోట్లు
పాఠశాల విద్యకు-రూ. 31,806 కోట్లు
ఉన్నత విద్యకు- రూ. 2,506 కోట్లు
బీసీ సంక్షేమం-రూ. 23,260 కోట్లు
ఎస్సీల సంక్షేమానికి-రూ. 20,281
ఎస్టీల సంక్షేమానికి- రూ. 8,159 కోట్లు
అల్పసంఖ్యాక వర్గాల కోసం- రూ. 5,434 కోట్లు
వైద్యారోగ్య శాఖ-రూ. 19,265 కోట్లు
పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ-రూ. 18,848 కోట్లు
జలవనరుల శాఖ-రూ. 18,020 కోట్లు




పురపాలక శాఖ-రూ. 13,862 కోట్లు
ఇంధన శాఖ-13,600 కోట్లు
వ్యవసాయ అనుబంధ రంగాలకు- రూ. 13,487 కోట్లు
రవాణాశాఖ-రూ. 8,785 కోట్లు
సాంఘిక సంక్షేమం- రూ. 10,909 కోట్లు
ఆర్థికంగా వెనుకబడినవారి సంక్షేమంకోసం- రూ. 10,619 కోట్లు

# సర్కారీ బడులకు శుభవార్త..

**- ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం..**

**-ఇక ఆ ఇబ్బంది తప్పినట్టే.!**




ఏపీ విద్యా వ్యవస్థను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా బడ్జెట్‌లో విద్యా రంగానికి కేటాయింపులు జరిపింది. పాఠశాలల్లో మౌలిక వసతులను మరింత మెరుగుపరిచే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా విద్యుత్ అందించనుంది. 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. రూ. 3.22 లక్షల కోట్లతో పయ్యావుల ఏపీ బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇక బడ్జెట్‌లో విద్యారంగానికి కూడా భారీగా కేటాయింపులు జరిపారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా విద్యుత్ అందించనున్నట్లు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రకటించారు.

మరోవైపు ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ గురించి ఏపీ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్.. ఎక్స్ వేదికగా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. "ఏపీలో పాఠశాల విద్యను దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందించాలని నిర్ణయించడం విప్లవాత్మకమైన నిర్ణయం. ఇది స్థానిక సంస్థలపై ఆర్థిక భారాన్ని తగ్గించడమేగాక ఉపాధ్యాయులు, విద్యార్థులపై ఒత్తిడి తగ్గిస్తుంది. సూపర్ %-% 6 హామీల్లో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనం పథకాన్ని 2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రారంభించడానికి బడ్జెట్లో నిధులు కేటాయించాం. రాష్ట్రంలో 1 నుంచి 12వ తరగతివరకు చదువుకునే ప్రతి విద్యార్థికి ఈ పథకాన్ని వర్తింపజేస్తాం" అంటూ నారా లోకేష్ ట్వీట్ చేశారు.

మరోవైపు 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో పాఠశాల విద్యకు రూ. 31,805 కోట్లు, ఉన్నత విద్యకు రూ. 2,506 కోట్లు మొత్తంగా.. 34,311 కోట్లు కేటాయించినట్లు నారా లోకేష్ తెలిపారు. గతేడాది కేటాయింపుల కంటే ఇది రూ. 2076 కోట్లు అధికమని నారా లోకేష్ పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలో ఏపీ మోడల్ విద్యావ్యవస్థను తీసుకు రావాలన్న తన సంకల్పానికి బడ్జెట్లో కేటాయించిన నిధులు దన్నుగా నిలుస్తాయని నారా లోకేష్ అభిప్రాయపడ్డారు.

ఆంధ్రప్రదేశ్‌లో నవీన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీంతో ఏపీ యువత అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవకాశం కలుగుతుందంటూ నారా లోకేష్ ట్వీట్ చేశారు. ప్రభుత్వ స్కూళ్లకు ఉచిత విద్యుత్ అందించడం ద్వారా స్థానిక సంస్థలపై విద్యుత్ ఛార్జీల భారం తగ్గించాలని ఏపీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.



## హసన్ పర్తి 66డివిజన్ లో మరియు 1డివిజన్ లో వీధి లైట్స్ తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు

హసాన్ పర్తి,28 ఫిబ్రవరి(క్రాంతి న్యూస్):66డివిజన్ మరియు 1డివిజన్ లో వీధి లైట్స్ దసరా నుంచి రావడం లేదు మున్సిపాలిటీ ఏ ఈ సరిత ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు కొన్ని వీధులలో ప్రజలు ఇబ్బంది పాలు పడుతున్నారు


## నందిమేడారం జడ్పీఎచ్ఎస్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు



ధర్మారం,,28 ఫిబ్రవరి(క్రాంతి న్యూస్):పెద్దపెల్లి జిల్లా ధర్మారం మండలంలోని నంది మేడారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు హెచ్ఎం కే.వసంత తెలిపారు. సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాలవేసిఘనంగా నివాళులర్పించారు. శాస్త్రవేత్త రామన్ ఎఫెక్ట్ నుకనుగొని భౌతిక శాస్త్రంలో ప్రతిష్టాత్మక నోబెల్ బహుమతిని సాధించారని హెచ్ఎం కొనియాడారు.భారత ఖ్యాతిని నలువైపులా విస్తరించారన్నారు.ఇదే స్ఫూర్తితో ప్రతి ఏటా ఫిబ్రవరి 28 న సైన్స్ దినోత్సవం జరుపుకుని విద్యార్థులు తయారుచేసిన వివిధ సైన్స్ ప్రాజెక్టులు రేన్ వాటర్ హార్వె స్టింగ్, లేయర్స్ ఆఫ్ సాయిల్, డ్రిప్ ఇరిగేషన్, చంద్రయాన్ 3 మొదలైన సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులకు స్పీచ్ కాంపిటేషన్, రంగోలి, పుస్తక ప్రదర్శన, సైన్స్ క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. సైన్స్ టీచర్లు విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. విద్యార్థులను జూనియర్ సైంటిస్టులుగా తీర్చిదిద్దడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.ఈ సందర్భంగా హెచ్ఎం కే.వసంత మాట్లాడుతూ సైన్స్ డే జరుపుకోవడం వలన విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవాటు చేసుకుని సైంటిస్టులుగా ఎదగా లనే లక్ష్యం ఏర్పరచుకొనే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ టీచర్లు వి.అనురాధ, వసంత, శ్రీవిద్య, మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

### - డిపో మేనేజర్‌కు వినతిపత్రం



తొర్రూర్,28 ఫిబ్రవరి(క్రాంతి న్యూస్):పబ్లిక్ న్యూస్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు తమ బకాయిలను త్వరగా చెల్లించాలని కోరుతూ తొర్రూర్ డిపో మేనేజర్ పద్మావతికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు గట్టు ప్రభాకర్, జి. రామచంద్రయ్య, సోమన్నలు మాట్లాడుతూ, డిపోలో సుమారు 130 మందికి పైగా రిటైర్డ్ ఉద్యోగులు ఉన్నారని, వీరికి 2017 నుంచి పీఆర్సీ, సవరించిన ఆర్పీఆర్సీ, ఈఎల్, గ్రాట్యుయిటీ, టీఎస్సీ ఎరియర్స్ వంటి పలు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. వీరికి వారి పే స్కేల్‌ను అనుసరించి ఒక్కొక్కరికి సుమారు లక్ష రూపాయల నుంచి రెండు లక్షల రూపాయల వరకు బకాయిలు ఉన్నాయని, వీటిని వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. నూతన కమిటీ ఎన్నిక సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడు పి. వెంకన్న, కార్యదర్శి: గూడెల్లిరామచంద్రయ్య కోశాధికారి:కె.వి. స్వామిలిముఖ్య సలహాదారులు: సిహెచ్. వెంకన్న, డి.వి. స్వామి ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి నన్నపనేని రాజు, జి.ఆర్. చంద్రయ్య, వెంకన్న, గట్టు ప్రభాకర్, దీకొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు. విశ్రాంత ఉద్యోగులు తమ హక్కులను సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## ప్రతి పౌరుడు తమ హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించాలి



మర్పల్లి,28ఫిబ్రవరి(క్రాంతి న్యూస్):ప్రతి పౌరుడు తమ హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించాలని సంఘంలో కులమాతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి ఉండాలని మర్పల్లి తహసీల్దార్ మునీరుద్దీన్ ఎస్ ఐ సురేష్ లు అన్నారు మర్పల్లి మండలం కోటమరుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా సిరిపురం ఎస్సీ హాస్టల్ సంక్షేమ అధికారి జి తుల్జారాం గౌడ్ అధ్యక్షతన పౌరుల హక్కులతో పాటు బాధ్యతలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షులు ఎం కృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి జీవించాలని గ్రామంలో మంచి వాతావరణం కల్పించాలని అన్నారు ఈ సమావేశంలో ఆర్ ఐ మాధవరెడ్డి మాజీ ఎంపీటీసీ వెంకట్ రెడ్డి మాజీ సింగిల్ విండో చైర్మన్ రఘుపతి రెడ్డి పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ మల్లారెడ్డి మాజీ ఉపసర్పంచ్ అంజిరెడ్డి అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు బేకరీ అంజన్న శ్రీశైలం గౌడ్ రిటైర్డ్ టీచర్ బాలయ్య బలరాం గౌడ్ మరియు హెల్త్ ఆఫీసర్ అంగన్వాడీలు ఆశా వర్కర్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## సమిష్టిగా పోరాడుదాం.

హనుమకొండ జిల్లా,28 ఫిబ్రవరి(క్రాంతి న్యూస్):జనని హౌసింగ్ సొసైటీ జర్నలిస్టులు అనేక సమస్యలకు గురవుతున్నారని జనని హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి సునీల్ కుమార్ ఉపాధ్యక్షుడు జయపాల్, కోశాధికారి దామోదర్, ఆర్గనైజర్ వెంకన్న తెలిపారు. లావుడియా రాజు నాయక్ భూక్య శ్రవణ్ కుమార్ శు క్రవారం ఏర్పాటు చేసిన జర్నలిస్టుల జనని హౌసింగ్ సొసైటీ మొదటి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరి కోసం ఒకరు, ఒకరి కోసం అందరూ సమిష్టిగా నిలబడాలనే ఉద్దేశ్యంతో జర్నలిస్టుల భవిత కోసం సొసైటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నో అవమానాలకు ఎదురొడ్డి కర్తవ్యం నెరవేరుస్తూ జీతం లేని ఉద్యోగిగా సమాజ సేవకు అంకితమవుతున్న జర్నలిస్టులకు చేయూత, అండ ఇవ్వాలనే ఉద్దేశ్యంతో సొసైటీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. సొసైటీలో ఉన్న అందరికీ చేయూతగా ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకుంటూ ముందుకు సాగాలని, సమాజంలో జర్నలిస్టుల సంఘటిత శక్తిని చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, రిజిస్ట్రేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సీనియర్ కార్యకర్తని పరామర్శించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్.



చెన్నరావుపేట,28 ఫిబ్రవరి(క్రాంతి న్యూస్):సీనియర్ కార్యకర్తని పరామర్శించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్..చెన్నారావుపేట మండలం కొనపురం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్తని ఈ రోజు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పరామర్శించారు..గత కొన్ని రోజులుగా ఇదే గ్రామనికి చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త కోరే ప్రభాకర్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ పరామర్శించారు..అనంతరం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో వీరి వెంట గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్ మాజీ ఎంపీటీసీ ఆవుల రాములు మాజీ ఉప సర్పంచ్ నర్సింహా రావులు లింగ మూర్తి చారి గుటుకుల సంపత్ జన్ను రాజశేఖర్ యకయ్య సదానందం కుండే రవి తదితరులు పాల్గొన్నారు..

చెన్నారావుపేట మండలం కొనపురం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్తని ఈ రోజు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పరామర్శించారు..గత కొన్ని రోజులుగా ఇదే గ్రామనికి చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త కోరే ప్రభాకర్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ పరామర్శించారు..అనంతరం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో వీరి వెంట గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్ మాజీ ఎంపీటీసీ ఆవుల రాములు మాజీ ఉప సర్పంచ్ నర్సింహా రావులు లింగ మూర్తి చారి గుటుకుల సంపత్ జన్ను రాజశేఖర్ యకయ్య సదానందం కుండే రవి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రాగా ప్లే అండ్ హై స్కూల్ లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



భద్రాద్రి కొత్తగూడెం ,28 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): స్థానిక కొత్తగూడెం మేదరబస్తి లోని శ్రీ రాగా ప్లే అండ్ హై స్కూల్ లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా పాఠశాల యాజమాన్యం మల్లారపు.వర ప్రసాద్ మరియు మల్లారపు.కవితలు హాజరయ్యారు.ఈ సందర్భంగా హై స్కూల్ విద్యార్థులకు ఉపన్యాస పోటీలు , సైన్స్ ఎక్సిబిట్స్ , క్విజ్ పోటీలు నిర్వహించారు..ఈ పోటీల్లో ఏస్.జాహ్నవి(10),రీషిత్ రాణా(9), నిహాల్ (9), ఏస్.కార్తిక్(8)లు బహుమతులు గెలుచుకున్నారు.ప్లే స్కూల్ చిన్నారుల ఫాన్సీ డ్రెస్సులు అలరించాయి.వీరలో సర్ సి వి రామన్ గా హుస్సేన్ (యు కే జి ),అబ్దుల్ కలాం లా చైత్రిక (యు కె జి )లు ఫాన్సీ డ్రెస్సుల్లో వచ్చారు.ఈ సందర్భంగా యాజమాన్యం సైన్స్ ఉపాధ్యాయులు: సర్వేశ్వర రావు (ఫిజిక్స్) , రేష్మా (బయాలజీ) లను బహుమతులతో సత్కరించింది.కరస్పాండెంట్ వర ప్రసాద్ మాట్లాడుతూ సర్. సి.వి.రామన్ నా మతం , నా ఆరాధ్య దైవం సైన్స్ అన్నారని,రామన్ ఎఫెక్టు ఫలితమే ఈ జాతీయ సైన్స్ దినోత్సవం అని ఆన్నారు. రామన్ ఎఫెక్టు ఆవిష్కరణ జరిగి సరిగ్గా ఈ రోజుకు 95 సంవత్సరాలైంది అని అన్నారు.డైరెక్టర్ కవిత మాట్లాడుతూ ఎంతోమంది సైంటిస్టులు ఈ ప్రపంచానికి విలువైన విజ్ఞానం అందించారని..సైన్స్ నిత్య జీవితంలో ఓ ముఖ్యమైన అంశంగా మారిందని ఆన్నారు.ఈ నాటి విద్యార్థులే రేపటి భావి భారత సైంటిస్తులని వారన్నారు..ఈ కార్యక్రమంలో రాంబాబు,కౌసర్ శోభా, జ్యోతి,రాంసింగ్, విద్యార్థులు పాల్గొన్నారు..

# నూతన శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలో యువత గ్లోబల్ లీడర్ గా ఎదగాలి.

### జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కే శ్రీనివాస్.

చెన్నరావుపేట,28ఫిబ్రవరి(క్రాంతిన్యూస్):చెన్నారావుపేట నూతన శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలో యువత విద్యార్థులు గ్లోబల్ లీడర్గా ఎదగాలని జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కే శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సిద్ధార్థ హై స్కూల్ లో అంతర్జాతీయ సైన్స్ డే పురస్కరించుకొని పాఠశాలలో ఏర్పాటుచేసిన సైన్స్ ఫెయిర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నూతన పరిజ్ఞానంతో కొత్త విషయాలను ఆవిష్కరించాలన్నారు. విద్యార్థులు సైన్స్ పట్ల మరింత ఆసక్తిని పెంచుకోవాలని అన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ఎగ్జిబిట్లను తిలకించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి బాలకృష్ణ, ఎంపీడీవో శ్రీ వాణి, ఎస్సై రాజేష్ రెడ్డి. ట్రస్మా డివిజన్ అధ్యక్షులు పాశికంటి రమేష్. జిల్లా ఉపాధ్యక్షులు జాంగిర్. మాజీ జెడ్పిటిసి జున్నుతుల రాంరెడ్డి. ప్రిన్సిపాల్ అండెం కరుణాకర్ రెడ్డి. ఏఎస్ఐ లక్ష్మాణమూర్తి, ఉపాధ్యాయ ఉపాధ్యాయునీలు. విద్యార్థులు పాల్గొన్నారు.




## ప్రతి పౌరుడు,తమ హక్కులు, బాధ్యతలను గుర్తించి, కులమతాలకు అతీతంగా కలిసి మెలిసి ఉండాలి, మర్పల్లి తహసీల్దార్ మునిరోద్దీన్, ఎస్ ఐ, సురేష్ లు.



వికారాబాద్,28 ఫిబ్రవరి(క్రాంతి న్యూస్):ప్రతి పౌరుడు తమ హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించాలని సంఘంలో కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి ఉండాలని మర్పల్లి తహసీల్దార్ మునీరుద్దీన్ ఎస్ ఐ సురేష్ లు అన్నారు. మర్పల్లి మండలం కోటమరుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా సిరిపురం ఎస్సీ హాస్టల్ సంక్షేమ అధికారి జి తుల్జారాం గౌడ్ అధ్యక్షతన పౌరుల హక్కులతో పాటు బాధ్యతలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షులు ఎం కృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి జీవించాలని గ్రామంలో మంచి వాతావరణం కల్పించాలని అన్నారు ఈ సమావేశంలో ఆర్ ఐ మాధవరెడ్డి మాజీ ఎంపీటీసీ వెంకట్ రెడ్డి మాజీ సింగిల్ విండో చైర్మన్ రఘుపతి రెడ్డి పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ మల్లారెడ్డి మాజీ ఉపసర్పంచ్ అంజిరెడ్డి అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు బేకరీ అంజన్న శ్రీశైలం గౌడ్ రిటైర్డ్ టీచర్ బాలయ్య బలరాం గౌడ్ మరియు హెల్త్ ఆఫీసర్ అంగన్వాడీలు ఆశా వర్కర్లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# యువతలో పెరుగుతున్న గుండెపోటు గుబులు.. ఎందుకిలా జరుగుతోంది..

హెల్త్ న్యూస్ ,28 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్ ): ఆడే పాడే వయసులోనే గుండె చప్పుడు ఎందుకు ఆగిపోతోంది. ఫిట్‌గా ఉన్నవారికి గుండెపోటు ఎందుకొస్తోంది. యువతలో హార్ట్ ఎటాక్ కేసులు ఈ మధ్య ఎందుకు పెరిగిపోతున్నాయి. ఊహ తెలిసీ తెలియకముందే గుండెపోటు ఎందుకు కాటేస్తోంది. ఇందుకు ప్రధాన కారణాలు ఇవే అని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు..



ఒక అమ్మాయి లేదా అబ్బాయి స్కూల్ గ్రౌండ్ స్నేహితులతో కలిసి సరదాగా ఆడుకుంటూనే గుండెపోటు వచ్చి హఠాత్తుగా కుప్పకూలిపోతారు. ఇక పట్టుమని పాతిక దాటని యువకుడు చూసేందుకు దృఢంగానే ఉంటాడు. రోజూ జిమ్ చేస్తాడు. కానీ ఇంట్లో వాళ్లతో భోజనం చేస్తూనో, క్లాసులో పాఠాలు వింటూనో, ఆఫీసులో పనిచేస్తూనో సడన్‌గా గుండె ఆగిపోయి చనిపోతాడు. ప్రస్తుతం వార్తాపత్రికలు, టీవీలు, సోషల్ మీడియాలో ఇలాంటి వార్తలు తరచూ వినిపిస్తున్నాయి. ఒకప్పుడు పెద్ద వయసు వాళ్లలోనే కనిపించే ఈ సమస్య పసిహృదయాలనూ వేధిస్తోంది. అసలు ఎందుకిలా జరుగుతోంది. కారణాలేంటి..

చిన్నతనంలోనే గుండెపోటు గుబులు..

మనం బతికున్నకాలం నిర్విరామంగా విశ్రాంతి తీసుకోకుండా పనిచేసే ఏకైక అవయవం గుండె. ఒక్క క్షణం ఆగినా శరీరంలోని ఏ భాగం పనిచేయలేదు. వందేళ్ల పాటు పనిచేసి మన ప్రాణాలను నిలబెట్టాల్సి గుండె పట్టుమని 18 ఏళ్లు కూడా నిండని వారిలో కూడా ఆగిపోతోంది. ఇందుకు కారణాలు అనేకం. కొన్ని సార్లు చురుగ్గా, క్రమశిక్షణతో ఉండే అథ్లెట్లు హార్ట్ అటాక్ సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఎందుకంటే నేటితరం జీవనశైలి పూర్తిగా మారిపోయింది. ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోలేకపోతున్నారు. శారీరక శ్రమ లోపించడం, మానసిక ఒత్తిడి వల్ల కార్టిసాల్ స్థాయి పెరిగి బీపీ రావడం, అనారోగ్యకర ఆహార అలవాట్లు ఇలా ఎన్నో కారణాల వల్ల గుండె పనితీరుకు ఆటంకం కలుగుతోంది.

నిత్యం క్షణం తీరికలేకుండా గడపుతోంది నేటి యువతరం. అందుకే చాలామంది ప్రాసెస్ ఫుడ్, జంక్ ఫుడ్, బయట వండిన ఆహారాన్ని అతిగా తినేస్తున్నారు. ఈ పదార్థాల్లోని కొవ్వులు, నూనెలు, చక్కెరలు వంటివి బీపీ, షుగర్, అల్సర్లు, కొలెస్ట్రాల్ తదితర అనారోగ్యాలను తెచ్చిపెడుతూ హార్ట్ ఎటాక్ వచ్చేందుకు బాటలు పరుస్తున్నాయి. పుట్టిననాటి నుంచి అనారోగ్యకర ఆహారపు అలవాట్లు, జీవనశైలి సరిగా లేకపోవడం, వ్యాయామాలు చేయకపోవడం, సరిపడినంత నిద్రకు దూరమవడం వల్ల ఊబకాయులుగా మారిపోతున్నారు. గుండెపోటు, డయాబెటిస్, బీపీ సహా అన్ని వ్యాధులకు మూలం అధిక బరువే. ఇక మద్యం, ధూమపానం వంటి అనేక కారణాల వల్ల కూడా శరీరంలో కొలెస్ట్రాల్ పెరిగిపోయి గుండెకు రక్తప్రసరణ ఆగిపోతోంది. కాబట్టి, మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండేలా జీవనవిధానం, ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకుని మీ గుండెని రక్షించుకోండి.

# రోజుకి ఒక అరటిపండు తింటే బరువు తగ్గుతారా?



హెల్త్ న్యూస్ ,28 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్ ): అరటిపండు.. దీనిని చాలా మంది ఇష్టంగా తింటారు. అరటిపండు రుచి తియ్యగా ఉంటుంది. చిన్నా, పెద్దా తేడా లేకుండా అరటి పండును ఆస్వాదిస్తారు. అరటిపండుతో జ్యూస్, స్మూతీలు, స్వీట్స్, షేక్స్ వంటివి తయారు చేస్తారు. అరటిపండులో లెక్కలేనన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. దీనిని పోషకాల పవర్ హౌస్ అంటారు. ఈ పండులో అనేక రకాల పోషకాలు ఉంటాయి. అసలు రోజుకి ఒక అరటిపండు తింటే ఏమవుతుంది? ఎప్పుడు తినాలి? శరీరానికి కలిగే ప్రయోజనాలేంటి? అనే విషయాలు ఇక్కడ తెలుసుకుందాం.

అరటిపండులోని పోషకాలు: అరటిపండులో పోషకాలు మెండుగా ఉంటాయి. ఇందులో ఎక్కువగా పొటాషియం ఉంటుంది. ఇది అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధుల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది. అలాగే అరటిలో సహజ చక్కెర అధికంగా ఉంటుంది. రోజు తినడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. అంతేకాకుండా మెగ్నీషియం, విటమిన్ బి6, ఫాస్ఫరస్ వంటి విటమిన్లు, ఖనిజాల గని. అరటిపండు తినడం వల్ల శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. ఆ మేలు ఏంటో ఇక్కడ తెలుసుకుందాం.

తక్షణశక్తిని అందిస్తుంది : అరటిపండ్లు కార్బోహైడ్రేట్లకు మంచి మూలం. ముఖ్యంగా గ్లూకోజ్, ఫ్రక్టోజ్, సుక్రోజ్ వంటి సహజ చక్కెరలు అరటిపండులో ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తిని ఇస్తాయి. ఏదైనా చిరుతిండి బదులు అరటిపండు తినడం వల్ల శరీరానికి కావాల్సినంత శక్తి అందుతుంది. ఇది ఎనర్జీ బూస్టర్‌లా పనిచేస్తుందని నిపుణులు అంటున్నారు.

చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది : అరటిపండు తీసుకోవడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో చాలా ఉపయోగకరంగా ఉంటుంది. అరటి పండులో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. ధమనులలో పేరుకుపోయిన కొవ్వును కరిగించి బయటకు పంపడంలో సహాయపడుతుంది. అరటిపండు తినడం వల్ల గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది.

ఎముకల బలం రెట్టింపు : అరటిపండ్లలో కాల్షియం, మెగ్నీషియం లభిస్తాయి. ఇవి ఎముకలను బలోపేతం చేయడంలో సహాయపడతాయి. దీన్ని తినడం వల్ల ఆస్టియోపోరోసిస్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. ఎముకల బలం కోసం రోజుకి కనీసం ఒక అరటిపండు తినాలంటున్నారు నిపుణులు.

మానసిక ఆరోగ్యం : అరటిపండ్లలో విటమిన్ బి6 ఉంటుంది. ఇది మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. ఇది మానసిక ఒత్తిడి, ఆందోళన, నిరాశను తగ్గించడంలో సహాయపడుతుంది. ఈ రోజుల్లో చాలా మంది వర్క్ లైఫ్‌స్టైల్ కారణంగా చాలా మంది ఒత్తిడి సమస్యలతో బాధపడుతున్నారు. అలాంటి వారికి అరటిపండు మంచి ఆప్షన్.

జీర్ణక్రియ మెరుగుపడుతుంది :అరటిపండులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇందులో పెక్టిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది కడుపు సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది.

బరువు తగ్గవచ్చు:సాధారణంగా బరువు తగ్గాలనుకునేవారికి అరటిపండు బెస్ట్ ఆప్షన్. రోజూ అరటిపండు మితంగా తింటే బరువు తగ్గవచ్చు. ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. దీన్ని తినడం వల్ల ఆకలి అదుపులో ఉంటుంది. కేలరీల సంఖ్య కూడా తక్కువే. అరటిపండులో సహజ తీపి ఉంటుంది. దీంతో, ఇది తినడం వల్ల సహజ తీపి తినాలనే కోరిక ఉండదు.

రోజుకి ఎన్ని, ఎప్పుడు తినాలి? :రోజు బ్రేక్ ఫాస్ట్ తర్వాత దీనిని తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు మీ శరీరానికి అందుతాయి. ఇక, వ్యాయామానికి ముందు అరటిపండు తినడం మంచిది. అరటిపండు తినడం వల్ల తక్షణ శక్తి వస్తుంది. రోజుకి ఒక అరటిపండు తింటే సరిపోతుంది. అంతేకానీ, ఎక్కువ తింటే ఆరోగ్యానికి పడదంటున్నారు నిపుణులు.

# ఖాళీ కడుపుతో టీ తాగితే ఏమవుతుందో తెలుసా?



హెల్త్ న్యూస్ ,28 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్ ): ఉదయం నిద్రలేచిన తర్వాత ఖాళీ కడుపుతో టీ తాగడం చాలా మంది దినచర్యలో ఒక భాగంగా వుంటుంది. కానీ అది మీ ఆరోగ్యంపై కొన్ని వ్యతిరేక ప్రభావాలను చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. అవేమిటో తెలుసుకుందాము.ఖాళీ కడుపుతో టీ తాగడం వల్ల కడుపులో ఆమ్ల స్థాయి పెరుగుతుంది.ఈ కారణంగా అసిడిటీ, కడుపులో చికాకు, గ్యాస్ వంటి సమస్యలు రావచ్చు.టీలో ఉండే టానిన్లు, కెఫిన్ జీర్ణవ్యవస్థను ప్రభావితం చేస్తాయి.దీనివల్ల ఆకలి లేకపోవడం, జీర్ణవ్యవస్థ బలహీనపడటం జరుగుతుంది.  టీలో ఉండే కెఫిన్ శరీరం నుండి నీటిని తొలగించడానికి పనిచేస్తుంది.ఉదయం ఖాళీ కడుపుతో టీ తాగడం వల్ల డీహైడ్రేషన్ వస్తుంది.ఖాళీ కడుపుతో టీ తాగడం వల్ల శరీరంలోని హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుంది.టీలోని టానిన్లు దంతాలపై మరకలు వేసి, దంతాలను దెబ్బతినేలా చేస్తాయి.

# సహజసిద్ధమైన పెయిన్ కిల్లర్స్

హెల్త్ న్యూస్ ,28 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్ ): శరీరంలో ఏదైనా నొప్పి అనిపిస్తే వెంటనే మనం పెయిన్ కిల్లర్ మాత్రలు వేసుకుంటుంటాం. కానీ సహజసిద్ధమైన పెయిన్ కిల్లర్స్ మన వంటిట్లోనే



వున్నాయి.దంతాలు నొప్పిగా వున్నప్పుడు ఓ లవంగం చప్పరిస్తే నొప్పి తగ్గుతుంది.గొంతునొప్పిగా వున్నప్పుడు కాస్తంత తేనెను సేవిస్తే ఫలితం వుంటుంది.కీళ్లనొప్పులు, వెన్నునొప్పి బాధిస్తున్నప్పుడు మిరియాలను ఆహారంలో భాగం చేసుకోవాలి.బ్లాడర్ సమస్యలతో వున్నవారు బ్లూబెర్రీలు తింటుండాలి. సీజనల్ వ్యాధులు రాకుండా వుండాలంటే పసుపు పాలు తాగుతుండాలి.కడుపులో నొప్పికి పుదీనా నీరు తాగితే మేలు చేస్తుంది.కడుపులో వికారంగా వున్నప్పుడు అల్లం టీ తాగితే సర్దుకుంటుంది.



KR TV క్రాంతి
శనివారం 01 మార్చి 2025

# క్రీడలు

epaper.krtvnews.com



# భారత బాక్సింగ్‌ను ముందుకు తీసుకెళ్తా!

స్పోర్ట్స్ న్యూస్ ,28 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్ ): దేశంలో బాక్సింగ్‌కు మరింత వన్నె తెచ్చేందుకు తన వంతు కృషి చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు భారత స్టార్ బాక్సర్ విజేందర్ సింగ్ పేర్కొన్నాడు. అందుకోసం అవసరమైతే భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) ఎన్నికల్లో పోటీ చేసేందుకు కూడా వెనకాడనని వెల్లడించాడు. భారత్ నుంచి ఒలింపిక్స్‌లో పతకం నెగ్గిన ఏకైక పురుష బాక్సర్ అయిన విజేందర్ సింగ్… బీఎఫ్ఐ ఎన్నికలను వీలైనంత త్వరగా నిర్వహించాలని ఆకాంక్షించాడు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో కాంస్యం నెగ్గిన విజేందర్ సింగ్… 2015లో ప్రొఫెషనల్ బాక్సర్‌గా అవతారమెత్తాడు.

గత మూడేళ్లుగా ప్రొఫెషనల్ సర్క్యూట్‌లోనూ యాక్టివ్‌గా లేని 39 ఏళ్ల విజేందర్ తాజాగా బీఎఫ్ఐ ఎన్నికలపై సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించాడు. ‘ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పోటీ చేయాలనుకుంటున్నా. నా జీవితం మొత్తం పోరాటాలే. ఇది కొత్త తరహాది అనుకుంటా. అయితే ఎన్నికల్లో మద్దతు లభిస్తుందా లేదా అనే అంశాలను పట్టించుకోవడం లేదు. ఆటకు నా వల్ల ప్రయోజనం చేకూరుతుందనుకుంటే తప్పకుండా పోటీలో ఉంటా. మార్పు తెచ్చే అవకాశం ఉంటే దాని కోసం నా వంతు కృషి చేస్తా. ఎన్నికల్లో పోటీ చేసినంత మాత్రాన బాక్సర్‌గా రిటైర్‌మెంట్ ప్రకటిస్తున్నట్లు కాదు. నేనెప్పటికీ అలా చేయను’ అని అన్నాడు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి సౌత్ ఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఓడిపోయిన విజేందర్ 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు భారతీయ జనతా పార్టీలో చేరాడు.



**విదేశీ శిక్షణ ముఖ్యం**

భారత యువ బాక్సర్లు విదేశాల్లో శిక్షణ తీసుకుంటే మెరుగైన ఫలితాలు సాధించే అవకాశాలున్నాయని విజేందర్ ఆశాభావం వ్యక్తం చేశాడు. ‘బాక్సింగ్ సమాఖ్యను మరింత బలోపేతం చేసేందుకు వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలి. ప్రభుత్వం ఏదైనా బాధ్యత అప్పగిస్తే దాన్ని నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉన్నా. మన దేశం క్రీడల్లో వేగంగా వృద్ధి చెందుతోంది. మరో మూడేళ్లలో లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ జరగనున్న నేపథ్యంలో విశ్వక్రీడల్లో మరిన్ని పతకాలు సాధించాలంటే భారత బాక్సర్లు విదేశీ బాక్సర్లతో తరచూ తలపడాలి’ అని విజేందర్ ‘ఎక్స్’లో పేర్కొన్నాడు. ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్ (2009)లో పతకం నెగ్గిన తొలి భారత పురుష బాక్సర్‌గా రికార్డుల్లోకి ఎక్కిన విజేందర్… గతంలో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకర్‌గానూ కొనసాగాడు.

బాక్సింగ్ సమాఖ్య పరిపాలన సంబంధించిన విధులను ఇటీవల భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అడ్‌హాక్ కమిటీకి అప్పగించిన నేపథ్యంలో… విజేందర్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఫిబ్రవరి 3తోనే బీఎఫ్ఐ ఆఫీస్ బేరర్ల పదవీ కాలం ముగియగా… ఎన్నికల నిర్వహణలో సమాఖ్య జాప్యం చేస్తుండటంతోనే ఐఓఏ ఈ చర్యకు పూనుకుంది. దీనిపై బీఎఫ్ఐ అధ్యక్షుడు అజయ్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐఓఏ ఆదేశాలు చట్టవిరుద్ధమని… దీనిపై ఢిల్లీ హైకోర్టులో సవాలు చేయనున్నట్లు వెల్లడించారు.

కాగా… బీఎఫ్ఐ ఆఫీస్ బేరర్లు ఆర్థిక అవకతవకలకు పాల్పడిన నేపథ్యంలోనే ఐఓఏ అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేసింది. భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) మాజీ కోశాధికారి మధుకాంత్ పాఠక్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తున్నారు. సమాఖ్యలో గందరగోళం కారణంగా బాక్సర్ల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

పారిస్ ఒలింపిక్స్‌లో రిక్తహస్తాలతో వెనుదిరిగిన మన బాక్సర్లు… ఆ తర్వాత అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడమే గగనమైంది. ఇక మహిళల జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్ వాయిదాల పర్వం కొనసాగుతోంది. ఇటీవల బల్గేరియాలో జరిగిన ప్రతిష్టాత్మక స్ట్రాంజా మెమోరియల్ టోర్నీలోనూ మన బాక్సర్లు పాల్గొనలేదు.

## అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడిన సచిన్..
## తృటిలో సెంచరీ మిస్

స్పోర్ట్స్ న్యూస్ ,28 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్ ): కేరళ, విదర్భ జట్ల మధ్య జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్ హోరాహోరీగా సాగుతుంది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించేందుకు ఇరు జట్లు శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన విదర్భ 379 పరుగులకు ఆలౌటైంది. యువ ఆటగాడు దనిశ్ మలేవార్ (153) సూపర్ సెంచరీతో విదర్భ భారీ స్కోర్ చేయడానికి దోహదపడ్డాడు. అతనికి కరుణ్ నాయర్ (86) సహకరించాడు. అనంతరం బరిలోకి దిగిన కేరళ విదర్భ తొలి ఇన్నింగ్స్ స్కోర్‌ను దాటేందుకు విశ్వప్రయత్నాలు చేస్తుంది. ఈ క్రమంలో ఆ జట్టు కెప్టెన్ సచిన్ బేబి అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కేరళను తొలి ఇన్నింగ్స్ సాధించే దిశగా తీసుకెళ్లాడు. అయితే దురదృష్టవశాత్తు సెంచరీకి రెండు పరుగుల దూరంలో ఔటయ్యాడు. ఈ ఇన్నింగ్స్‌లో 235 బంతులు ఎదుర్కొన్న సచిన్.. 10 బౌండరీల సాయంతో 98 పరుగులు చేశాడు. సచిన్‌తో పాటు వన్‌డౌన్ బ్యాటర్ ఆదిత్య సర్వటే (79) కేరళ ఇన్నింగ్స్‌కు గట్టి పునాది వేశాడు.



సర్వటే.. అహ్మద్ ఇమ్రాన్ (37), సచిన్ బేబి సహకారంతో అద్భుతమైన భాగస్వామ్యాలు నెలకొల్పాడు. అనంతరం సచిన్.. సల్మాన్ నిజర్ (21), మహ్మద్ అజహరుద్దీన్ (37), జలజ్ సక్సేనా (28 నాటౌట్) సాయంతో కేరళ ఇన్నింగ్స్‌ను నిర్మించాడు.

మూడో రోజు మూడో సెషన్ సమయానికి కేరళ తొలి ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్ల నష్టానికి 337 పరుగులు చేసింది. జలజ్ సక్సేనా, ఏడెన్ యాపిల్ టామ్ (6) క్రీజ్‌లో ఉన్నారు. విదర్భ తొలి ఇన్నింగ్స్ స్కోర్‌కు కేరళ ఇంకా 42 పరుగులు వెనుకపడి ఉంది. తొలి ఇన్నింగ్స్ లీడ్ సాధిస్తే ఈ మ్యాచ్ డ్రా అయినా కేరళనే విజేతగా నిలుస్తుంది. కాబట్టి తొలి ఇన్నింగ్స్ లీడ్ కోసం ఇరు జట్లు హోరాహోరీగా పోరాడుతున్నాయి.

**ఇబ్బంది పెట్టిన నల్కండే**

ఈ ఇన్నింగ్స్‌లో కేరళకు మంచి ఆరంభం? లభించలేదు. ఓపెనర్లు అక్షయ్ చంద్రన్ (14), రోహన్ కున్నుమ్మల్‌ను (0) దర్శన్ నల్కండే తెగ ఇబ్బంది పెట్టాడు. వీరిద్దరినీ నల్కండే 13 పరుగుల వ్యవధిలో క్లీన్ బౌల్డ్ చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో నల్కండే ఈ రెండు వికెట్లతో పాటు మరో వికెట్ కూడా తీశాడు. సెమీఫైనల్లో సెంచరీ హీరో మహ్మద్ అజహరుద్దీన్‌ను ఎల్బీడబ్ల్యూ చేశాడు. విదర్భ బౌలర్లలో నల్కండేతో పాటు హర్ష్ దూబే (2), యశ్ ఠాకూర్ (1), పార్థ్ రేఖడే (1) వికెట్లు తీశారు.

అంతకుముందు విదర్భ ఇన్నింగ్స్‌లో మలేవార్, కరుణ్ నాయర్ మినహా ఎవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. 11వ నంబర్ ఆటగాడు నచికేత్ భూటే (32) మలేవార్, కరుణ్ నాయర్ తర్వాత టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ధృవ్ షోరే (16), యశ్ ఠాకూర్ (25), కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ (23), అక్షయ్ కర్నేవార్ (12), హర్ష్ దూబే (12 నాటౌట్) రెండంకెల స్కోర్లు చేయగా.. పార్థ్ రేఖడే (0), దర్శన్ నల్కండే (1), యశ్ రాథోడ్ (3) పూర్తిగా నిరాశపరిచారు. కేరళ బౌలర్లలో నిదీశ్, ఈడెన్ యాపిల్ తలో 3 వికెట్లు పడగొట్టగా.. బాసిల్ 2, జలజ్ సక్సేనా ఓ వికెట్ దక్కించుకున్నారు.

కాగా, విదర్భ సెమీఫైనల్లో ముంబైను చిత్తు చేసి ఫైనల్‌కు చేరగా.. కేరళ గుజరాత్‌పై 2 పరుగుల స్వల్ప తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించి తొలిసారి ఫైనల్‌కు చేరింది.

## ఏంటిది? నేను అవుటయ్యానా? ..
## జాన్సన్ దెబ్బకు రహ్మనుల్లా బౌల్డ్




స్పోర్ట్స్ న్యూస్ ,28 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్ ): అఫ్గనిస్తాన్‌తో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా బౌలర్ స్పెన్సర్ జాన్సన్ అద్భుతం చేశాడు. నమ్మశక్యం కాని రీతిలో రహ్మనుల్లా గుర్బాజ్ ను బౌల్డ్ చేశాడు. ఇందుకు సంబంధించిన వీడియో క్రికెట్ ప్రేమికులకు కనువిందు చేస్తోంది. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025లో భాగంగా అఫ్గన్-ఆసీస్ శుక్రవారం లాహోర్ వేదికగా అమీతుమీ తేల్చుకుంటున్నాయి.

**నమ్మశక్యం కాని డెలివరీ**

ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఎలాంటి సమీకరణంతో పనిలేకుండా నేరుగా గ్రూప్-‘బి’ నుంచి సెమీస్‌లో అడుగుపెడుతుంది. అందుకే ఇరుజట్లకు ఈ మ్యాచ్ అత్యంత కీలకంగా మారింది. ఇక గడాఫీ స్టేడియంలో టాస్ గెలిచిన అఫ్గనిస్తాన్ తొలుత బ్యాటింగ్ ఎంచుకోగా.. ఆసీస్ లెఫ్టార్మ్ పేసర్ స్పెన్సర్ జాన్సన్ బౌలింగ్ ఎటాక్ ఆరంభించాడు.

ఈ క్రమంలో అఫ్గన్ ఇన్నింగ్స్ తొలి ఓవర్లో ఐదో బంతికే జాన్సన్ అద్భుత రీతిలో రహ్మనుల్లా గుర్బాజ్‌ను బౌల్డ్ చేశాడు. నమ్మశక్యం కాని డెలివరీతో అతడిని పెవిలియన్‌కు పంపాడు.

గంటకు 140.7 కిలోమీటర్ల వేగంతో జాన్సన్ సంధించిన బంతిని గుర్బాజ్ తప్పుగా అంచనా వేశాడు. స్వింగ్ అవుతున్న బాల్‌ను ఆడేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు.

**ఏంటిది? నేను అవుటయ్యానా?**

ఈ క్రమంలో బ్యాట్ కిందుగా వెళ్లిన బంతి ఆఫ్ స్టంప్‌ను ఎగురగొట్టింది. దీంతో గుర్బాజ్.. “ఏంటిది? నేను అవుటయ్యానా?.. నమ్మలేకపోతున్నా” అన్నట్లుగా ఇచ్చిన షాకింగ్ రియాక్షన్ వైరల్ అయింది.


మరోవైపు.. జాన్సన్ సహచర సభ్యులతో కలిసి తొలి వికెట్‌ను సెలబ్రేట్ చేసుకున్నాడు. కాగా చాంపియన్స్ ట్రోఫీ-2025లో అఫ్గనిస్తాన్ ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్ వరుస వైఫల్యాలు కొనసాగుతున్నాయి. సౌతాఫ్రికా, ఇంగ్లండ్‌లతో మ్యాచ్‌లలో అతడు వరుసగా 10, 6 పరుగులు చేశాడు. తాజాగా ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో ఐదు బంతులు ఎదుర్కొని డకౌట్‌గా వెనుదిరిగాడు.



# బధిర యువతిగా పూజ?

మూవీ న్యూస్ ,28 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్ ): తమిళ చిత్రసీమలో ప్రస్తుతం పూజా హెగ్డే హవా కనిపిస్తోంది. ఆమె.. సూర్య కలిసి నటించిన 'రెట్రో' మేలో విడుదల కానుండగా.. విజయ్‌తో చేస్తున్న 'జన నాయగన్', లారెన్స్‌తో చేస్తున్న 'కాంచన 4' చిత్రీకరణ దశలో ఉన్నాయి. వీటితో పాటు రజనీకాంత్ 'కూలీ' సినిమాలోనూ ఓ ప్రత్యేక గీతంలో సందడి చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు 'కాంచన 4'కు సంబంధించి ఓ ఆసక్తికర విషయం బయటకొచ్చింది. లారెన్స్ ప్రధాన పాత్రలో నటిస్తూ.. స్వయంగా తెరకెక్కిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రంలో పూజా సవాల్‌తో కూడిన పాత్ర పోషించనున్నట్లు తెలిసింది. ఆమె దీంట్లో బధిర యువతిగా కనిపించనున్నట్లు సమాచారం. అంతేకాదు ఆమె డీగ్లామర్ లుక్‌లో కనిపిస్తుందని తెలుస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ చిత్రంలో పూజతో ( పాటు నోరా ఫతేహి మరో నాయికగా సందడి చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

# నటుడిగా టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న బాలీవుడ్ దర్శకుడు




మూవీ న్యూస్ ,28 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్ ): అడివిశేష్ , మృణాల్ ఠాకూర్‌ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న చిత్రం డెకాయిట్ . ఈ సినిమాకు షానీల్ డియో కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్నాడు. లవ్ ,రివేంజ్ డ్రామగా రాబోతున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. సమ్మర్ కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ తాజాగా ఒక అప్‌డేట్ పంచుకున్నారు. ఈ సినిమాతో బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ సందర్భంగా అనురాగ్ కశ్యప్ ఫస్ట్ లుక్ విడుదల చేసింది. ఈ ఫస్ట్ లుక్ గమనిస్తే.. అనురాగ్ ఇందులో స్వామిమాల ధరించిన పోలీస్ పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. తెలుగుతో పాటు హిందీలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో అడివిశేష్ , మృణాల్ ఠాకూర్ మొదట ప్రేమికులుగా ఆ తర్వాత బద్ద శత్రువులుగా కనిపించబోతున్నట్లు తెలుస్తుంది.

# SSMB క్రేజీ అప్‌డేట్.. మహేశ్ బాబు కొత్త లుక్ వైరల్



మూవీ న్యూస్ ,28 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్ ): టాలీవుడ్ దర్శక దిగ్గజం ఎస్.ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబోలో ఒక సినిమా రానున్న విషయం తెలిసిందే. SSMB29 అంటూ వస్తున్న ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఇక ఈ సినిమా అప్‌డేట్‌ల కోసం అటు బాబు ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ తెగ ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మహేశ్ కొత్త లుక్‌కి సంబంధించి ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రాజమౌళితో పాటు ఈ సినిమా కోసం మహేశ్ కూడా బాగా కష్టపడుతున్నారు. ఇప్పటికే జుట్టు గడ్డం పెంచేసి లుక్స్ మొత్తం మార్చేసిన మహేశ్ తాజాగా జిమ్‌లో వర్కౌట్స్? చేస్తున్నాడు. అయితే మహేశ్ జిమ్‌లో ఎక్సర్‌సైజ్ అనంతరం అద్దం ముందుకు వెళ్లి తన లుక్‌ని చూసుకుని బయటకు వెళ్లే వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇందులో జుట్టు మొత్తం వదిలేసి రగ్గడ్ లుక్‌లో కనిపిస్తున్నాడు. దీంతో ఈ వీడియో ఒక్కసారిగా సోషల్ మీడియాలో ట్రెండింగ్?లోకి దూసుకెళ్లింది. ఇక వీడియో చూసిన అభిమానులు బాబు కొత్త లుక్ అదుర్స్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. అడ్వెంచర్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే కథతో వస్తుండగా.. ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తుంది.



# వింటేజ్ ఫీల్‌తో నేటి ప్రేమకథ

మూవీ న్యూస్ ,28 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): కథానాయిక అదితిరావు హైదరీ బాలీవుడ్‌లో ఓ ప్రేమకథా చిత్రంలో నటించనుంది. 'ఓ సాథీ రే' పేరుతో తెరకెక్కనున్న ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు ఇంతియాజ్ అలీ షోరన్నర్‌గా వ్యవహరించనున్నారు. అరీష్ అలీ దర్శకత్వం వహిస్తారు. అర్జున్ రాంపాల్, అవినాష్ తివారి ప్రధాన పాత్రధారులు. బాలీవుడ్‌లో హృద్యమైన ప్రేమకథా చిత్రాలకు చిరునామాగా ఇంతియాజ్ అలీ పేరు తెచ్చుకున్నారు.

ఆయన డైరెక్షన్‌లో వచ్చిన రాక్‌స్టార్, జబ్ వీ మెట్, లవ్ ఆజ్ కల్ చిత్రాలు బ్లాక్‌బస్టర్స్‌గా నిలిచాయి. ఈ నేపథ్యంలో తాజా చిత్రం 'ఓ సాథీ రే' ఆసక్తినిరేకెత్తిస్తున్నది. 'గత కాలపు విలువలు, హృదయభావనలతో నడిచే ఆధునిక ప్రేమకథా చిత్రమిది. ఏ మోడరన్ స్టోరీ విత్ వింటేజ్ హార్ట్. మెట్రోపాలిటన్ సిటీలో జరిగే ప్రేమకథగా ఆకట్టుకుంటుంది' అని ఇంతియాజ్ అలీ చెప్పారు. సీట్ ఫిల్మ్స్, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్, నెట్‌ఫ్లిక్స్ సంయుక్త భాగస్వామ్యంలో ఈ సినిమా తెరకెక్కనుంది.



# పరిణీతీ చోప్రా మొదలెట్టేసింది...

మూవీ న్యూస్ ,28 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్ ): అందంతో పాటు అభినయంలోనూ తన సత్తా చాటుతుంటుంది బాలీవుడ్ హీరోయిన్ పరిణీతీ చోప్రా .ఇంతకాలం వెండితెరకే పరిమితం అయిన ఈ భామ ఇప్పుడు ఓటీటీ ఎంట్రీకి సిద్ధమైంది. హిందీలో ఓ సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ కు అమ్మడు పచ్చజెండా ఊపేసింది. అంతేకాదు... ఇప్పుడు షూటింగ్ లో కూడా జాయిన్ అయిపోయింది. ఆమె నటిస్తున్న ఈ వెబ్ సిరీస్ షూటింగ్ ప్రస్తుతం సిమ్లాలో జరుగుతోంది. పరిణీతీ చోప్రాతో పాటు ఇందులో తాహిర్ రాజ్ బాసిన్, అనూప్ సోనీ, జెన్నిఫర్ వింగెట్, చైతన్య చౌదరి కీలక పాత్రలు పోషిస్తున్నారు.

'అక్స్ , రంగ్ దే బసంతి , స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ ' చిత్రాలకు రచన చేసిన రెన్సిల్ డిసిల్వా ఈ వెబ్ సిరీస్ కు దర్శకుడు. ఈయన ఇంతకుముందు 'ఖుర్బాన్, ఉంగ్లీ' చిత్రాలను రూపొందించాడు. ఈ వెబ్ సిరీస్ ను సిద్ధార్థ్ పి మల్హోత్రా, సప్నా మల్హోత్రా నిర్మిస్తున్నారు. తొలి వెబ్ సిరీస్ చిత్రీకరణలో పాల్గొనడం ఆనందంగా ఉందంటూ పరిణీతీ చోప్రా సోషల్ మీడియా ద్వారా తన హర్షాన్ని వ్యక్తం చేసింది.

Printed, Published and owned by ---------------------, Printed at ---------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com